ఆదివారం

ప్రజాశక్తి

జూలై 18, 2004

ATHENS 2004



Athenà Phèvos



ఏథెన్స్ టు ఏథెన్స్

హ్యాపీ బర్త్‌డే

(18-7-2004 నుండి 24-7-2004 వరకు)

డి.జోసఫ్
5 సం॥ 18-7-1999
సునీతా రత్నం - యేసురత్నం
కాతేరు, రాజమండ్రి

విహారి
7 సం॥ 18-7-1997
వనజ - దీక్షితులు
పామూరు, ప్రకాశం



ఏంజిల్ ప్రియ
1 సం॥ 18-7-2003
సుధారాణి - అరుణ్
విస్సన్నపేట, కృష్ణా జిల్లా

కె.మానస
4 సం॥ 19-7-2000
బాలామణి - శ్రీనివాస్
కవాడిగూడ, సికింద్రాబాద్

దీపక్
1 సం॥ 20-7-2003
శ్రీచైతన్య - శ్రీనివాస్
భీమవరం, నల్లగొండ

పూజిత
3 సం॥ 20-7-2001
అనిత - ఆంజనేయులు
ఆలేరు, నల్లగొండ

నాగసాయి
2 సం॥ 20-7-2002
వరలక్ష్మి - సుబ్బారావు
ఏలేశ్వరం, తూర్పుగోదావరి

రాహుల్ సాయి
5 సం॥ 20-7-1999
లక్ష్మి - వెంకటేశ్వర్లు
ముత్తుకూరు, నెల్లూరు

మౌనిక
3 సం॥ 22-7-2001
కృష్ణవేణి - శ్రీనివాస్
ధర్మన్నగూడ, రంగారెడ్డి

సాయి విక్రాంత్
జులై 22
కళావతి - సత్యనారాయణ
మధిర, ఖమ్మం

జి.ఎమ్.బాబు
6 సం॥ 22-7-1998
సునీత - జయచందర్
శంకర్‌పల్లి, రంగారెడ్డి

బాబాజి
8 సం॥ 23-7-96
విజయ - బ్రహ్మయ్య
సత్రంపాడు, ఏలూరు

శ్వేత
జులై 24
రమాదేవి - ఫణి కుమార్
విజయవాడ

అమృత వర్షిణి
6 సం॥ జులై 1998
నాగలక్ష్మి - కిషోర్
రేపల్లె, గుంటూరు

అనిల్
3 సం॥, జులై 2001
భాగ్యలక్ష్మి - సుబ్బారావు
నంబూరు, గుంటూరు

సాలోమి
5 సం॥ జులై 1999
అడ్డగుట్ట, సికింద్రాబాద్

నైమిష
5 సం॥, జులై 99
సునీత - భాస్కరరెడ్డి
సంతోష్ నగర్, హైదరాబాద్

లీడర్స్ మెయిల్

టు
ది ఎడిటర్, ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం



సోమనాథ్ గురించి తెలిసింది

జులై 4 ఆదివారం అనుబంధంలో లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ గురించి చాలా విపులంగా వివరించారు. భారతదేశంలో కమ్యూనిస్టులకు గల ప్రాధాన్యతకు అద్దం పట్టినట్లుగా వుంది. అలాగే ఆండాలమ్మ భర్త... కథ చాలా బాగుంది. యుక్త వయసులో మొటిమలు వస్తున్నాయని ఎంతోమంది బాధపడుతున్న తరుణంలో వాటి గుర్తించి క్లుప్తంగా డా॥ నాగినేని భాస్కరరావుగారు వివరించారు. వారికి మా ధన్యవాదాలు. న్యాయసలహాలు శీర్షిక అందరికీ కొంత ఊరటనిస్తోంది.

- విప్పాడ ఉమామహేశ్వరరావు,
కురుపాం, విజయనగరం జిల్లా

రియల్‌స్టోరీ ఉత్సాహం కలిగిస్తోంది

జులై 4 ఆదివారం అనుబంధంలో రియల్‌స్టోరీ శీర్షికన ప్రచురించిన 'ఒదిగిన పర్వత శిఖరం, జామి ఆండ్రూ తనకు కాళ్ళూ చేతులు లేకపోయినా, కృత్రిమ అవయవాలతో తన శక్తి యుక్తులతో పర్వత శిఖరారోహణం చేయాలన్న తన ప్రతిభావంతమైన మేధస్సుకు నిజంగా కృతజ్ఞతలు తెలపకతప్పదు. ఎంతో ఎత్తు కెదిగిన పర్వత శిఖరాలు సైతం తలవంచి జామీఆండ్రూకు ప్రణామం చేస్తాయి.

- మేదూరి సత్యనారాయణ,
తిరువూరు, కృష్ణాజిల్లా

నంది పరిషత్ కళాకారులకు వెలుగునివ్వాలి

జులై 4 అనుబంధంలో ప్రచురించిన 'నంది' వ్యాసం స్పందింప చేసింది. ప్రతీ ఏడాది నంది నాటక పరిషత్ నిర్వహణపై ప్రభుత్వం చూపుతున్న ప్రోత్సాహానికి సర్వదా.. కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము. ప్రస్తుతం బుర్రకథ, వీధి నాటిక, హరికథ, పగటి వేషాలు, తోలుబొమ్మలాట వంటి అనేక తెలుగు సాంస్కృతిక కళారూపాలను ప్రదర్శించే వీధి కళాకారుల పరిస్థితి కడు దుర్భరంగా వుంది! కొందరికైతే పూట గడవడమే కష్టంగా ఆవుంది! ఇలాంటి దీన పరిస్థితిలో ఉన్న ఆయా కళాకారుల భుక్తి కోసం ప్రభుత్వం తక్షణం కళారూప ప్రదర్శన ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తే కొంత ఊరట కలుగుతుంది. ఏ.పి.టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ ద్వారా గుర్తింపు పొందిన కళాకారుల కోసం సాంఘిక, పౌరాణిక, జానపద కార్యక్రమాలు, పుణ్యక్షేత్రాలలో నెలకు కనీసం 15 రోజులు ప్రభుత్వం ఏర్పాటు చేయాలి. వ్యవసాయ అభివృద్ధి, వరకట్న



నిర్మూలన, స్త్రీ విద్య, వయోజన విద్య ఆవశ్యకత, ఎయిడ్స్ నివారణ మొదలైన అంశాల ఆధారంగా కళా జాతాల ప్రదర్శనలు ఏర్పాటు చేయవలసిందిగా మనవి.

- జె.సుధాకరరావు,
కొండమ్మవీధి, కాకినాడ.



'జోరా' అనిపిస్తోంది

జులై 4 ఆదివారం అనుబంధంలో 'జోరా' శీర్షికలోని చిత్ర, విచిత్ర వార్తలు నిజంగా 'జోరా' అనిపించేటట్లు వున్నాయి. ట్రాన్‌వాన్ హే జుట్టు చూసి ఆశ్చర్యపోయాం. 'ఏ.సి.దిండు', 'సిగరెట్ తాగుతున్నారా తస్మాత్ జాగ్రత్త' చదివి ఆనందించాం. ఆశ్చర్యానికి లోనయ్యాం.

- ఎం.డి.ముస్తఖీమ్, కొల్లాపూర్, మహబూబ్‌నగర్.

వానరాకడ!

వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలియదని పూర్వం అనేవారు!

ఇది ఒకనాటి మాట!

ఇపుడు వాన ఎప్పుడు వస్తుందో ప్రాణం ఎప్పుడు పోతుందో ఇట్టే చెప్పేస్తున్నారు!

వైద్య శాస్త్రం ఇంకొంచెం ముందుకు పోయి ప్రాణం ఎప్పుడు పోవాలో కూడా నిర్ణయించేస్తోంది! సిరిగల వాళ్ళకు ప్రాణం మీదకు వస్తే కార్పొరేట్ ఆస్పత్రుల్లోని ఏసీ గదుల్లో బంధించి ఆక్సిజన్ తగిలించి అమెరికా నుండి అయినవాళ్ళు వచ్చేవరకు రోజుల తరబడి నెట్టుకు రావట్లేదూ? అలాగన్నమాట!....

అది వేరేసంగతి!

ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినిపించి ఈ ఏడాది మాంచి వర్షాలు కురుస్తాయని, పంటలు మా బాగా పండుతాయని చెబుతుంటారు! ఊరకే... ప్రజలంతా సంబరపడతారని ఇలా చెప్పేస్తుంటారు?!

వాతావరణ శాస్త్రవేత్తలేమో మన రాష్ట్రంలో పెద్దగా వర్షాలు కురవకపోవచ్చని సూచనలు ఇస్తుంటారు.

ఇదంతా పక్కన బెడితే.....

ఇదివరకటి కాలంలో జూన్ వచ్చిందంటే వర్షాలు మొదలయ్యేవి...

జులైలో నదుల్లో వరద నీరు చేరేది....

పిల్లలు వర్షంలో తడుచుకుంటూ బడికి వెళ్ళి వచ్చేవాళ్ళు.... పెద్ద వర్షం వచ్చిందంటే 'వానాకాలం బడుల'కు సెలవే కదా! అప్పుడు చూడాలి... పిల్లల ఆనందం... వాననీటిలో కాగితాల పడవలతో కేరింతలు....

ఇప్పుడా వానలూ లేవు... పిల్లలకు సరదాలు లేవు... వానాకాలపు బడులకు సెలవులూ రావడంలేదు....

సముద్రంలో అల్పపీడనం ఏర్పడితేనే వర్షం అనే విధంగా కాలం మారిపోయింది....వానలు కురిస్తేనే ఆశ్చర్యపడే రోజులొచ్చాయి......

వానలు లేక పొలాలు బీళ్లు పడుతున్నాయి...

బక్కచిక్కిన రైతు ఆకాశంలోని మబ్బుల వంక దీనంగా చూస్తున్నాడు...

పిల్లలేమో వాన రాకపోతుందా బడికి సెలవు రాకపోతుందా అని ఎదురు చూస్తున్నారు....

వాన కురిసినా కురవకపోయినా చిక్కులు సర్కారు వారికే కదా!?

అందుకే సర్కారువారు వర్షించే మేఘాల కోసం ఎదురు చూసి మోసపోకుండా ఆకాశంలోకి వెళ్ళి మేఘాల్లోని నీళ్ళు తోడుకువచ్చే పనిలో పడ్డారు....

అదే మేఘ మథనం....

నీళ్లు ఉన్నాయని అనుకున్న మేఘాలపై రసాయనాలు చల్లి వర్షాలు కురిపించుదామని సర్కారువారి ప్రయత్నం...

పాపం... ఈలోగా అల్పపీడనంతో వానలు కొద్ది కొద్దిగా పడుతున్నాయి....

ఈ వానలు ఇల్లాగే కురుస్తాయని...

అందరి ఆశలు నెరవేరుతాయని ఆశిద్దాం! ◆

ఈ సంచికలో . . .

ఓరా!	. . . 3
కార్టూన్ కదంబం...	. . . 4
కవర్ స్టోరీ	. . . 6
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
ఇంతిసంగతులు	. . . 16
జీవనశైలి	. . . 17
ఆరోగ్యం	. . . 18
పుస్తక పరిచయం	. . . 20
న్యాయసలహాలు	. . . 24

ఇంకా...

బోరు

కథ ... 9, 10

వ్యక్తిత్వ కోచ్

రియల్‌స్టోరీ... 14, 15



నీలగిరి పర్వతాలు

టూరిస్ట్ గైడ్ . . . 21

సంగీత సరస్వతి నిలయం

కళాసాహితి . . . 22, 23

ముంబయిలో ఖరీదైన భిక్షగాళ్ళు



ముంబయి నగరం అన్నింట్లోనూ ముందే ఉంటుంది. ప్రొఫెషనల్ భిక్షగాళ్ళ సంఖ్యలోనూ వారి ఆదాయంలో కూడా... సాధారణంగా బిక్షగాళ్ళంటే ఎముకలకు చర్మం అంటించినట్లు కనిపిస్తారిక్కడ... కాని ముంబయిలో వృత్తిపరమైన భిక్షగాళ్ళలో ఎక్కువమందికి ఒకటి రెండు కార్లుండటం సహజమట!? అక్కడ ఒక్కో భిక్షగాడికి రోజుకు సగటున రు.300లు ఆదాయం వస్తుందంటే ఆశ్చర్యపోనక్కర్లేదంటున్నారు! లక్షమంది భిక్షగాళ్ళతో అలరారుతున్న ముంబయి నగరంలో వారి ఒకరోజు సగటు ఆదాయం 3 కోట్ల రూపాయలు. ఆ నగరంలో కార్యకలాపాలు నిర్వహించే సోషల్ డవలప్‌మెంట్ సెంటర్ అనే ఒక స్వచ్ఛంద సంస్థ ఇటీవల భిక్షగాళ్ళపై సర్వే చేసి ఈ వాస్తవాలు బయటపెట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక బతుకుదెరువు కోసం ముంబయి చేరే సగటు జీవులు బక్కచిక్కిపోతుండగా, భిక్షాటనే వృత్తిగా నగరంలో స్థిరపడిన వాళ్ళు మాత్రం కార్లు కొని అద్దెకిచ్చే స్థాయికి చేరుకుంటున్నారట?! ఎంత అభివృద్ధి?

ఏనుగులకు ఫిట్‌నెస్?!

గత ఏడాది కేరళలో ఉత్సవాల్లో ఊరేగే ఏనుగులు మావటీలను తొక్కి చంపడం, ఉత్సవాలు చూడటానికి వచ్చినవారిపై దాడిచేయడం వంటి సంఘటనల గురించి వార్తల్లో చూశాం. త్వరలో మరలా కేరళ రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉత్సవాలు జరగబోతున్నాయి. వాటిలో తప్పకుండా ఏనుగులు పాల్గొనాల్సి ఉంటుంది. అందుకే ఏనుగుల ఫిట్‌నెస్ కోసం గురువాయూర్ దేవాలయం సుఖచికిత్స పేరుతో ఆయుర్వేద థెరపీ ప్రారంభించిందట?! ఈ చికిత్స ద్వారా ఏనుగుల ఆరోగ్యం మెరుగుపడి, మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆలయ అధికారులు చెబుతున్నారు. జరగబోయే ఉత్సవాల దృష్ట్యా ముందు జాగ్రత్త మంచిదే!?



సమోసాపై దావా!?

ఢిల్లీలో ఈ మధ్య సమోసాలు అమ్మే రెస్టారెంట్లు వాటికోసం ఆర్డరిచ్చేవాళ్ళ వృత్తి గురించి ఆరాతీస్తున్నాయట! విషయం ఏమిటంటే ఒక లాయర్ గారు ఒక ప్రముఖ రెస్టారెంట్‌కి వెళ్ళి తనకిష్టమైన సమోసాలకు ఆర్డరిచ్చారు! వారేమో పాచిపట్టిన సమోసాలు పెట్టడంతో ఆగ్రహించిన లాయర్ గారు రెస్టారెంట్‌పై సిటీ సివిల్ కోర్టులో దావా వేశారుట? సాధారణంగా హోటళ్ళలో పదార్థాలు బాగుండకపోతే ఏదో నాలుగు తిట్లు తిట్టి వచ్చేయడం జనానికి అలవాటు. అంతకుమించి చర్య తీసుకోవడానికి ఎవరూ ప్రయత్నించరు. ఈ కేసు విచారించిన కోర్టు వారు పాచిపట్టిన సమోసాలు పెట్టి ఖాతాదారుల ఆరోగ్యం చెడగొడుతున్నందుకు గాను ఆ రెస్టారెంట్‌కు వెయ్యి రూపాయల జరిమానా విధించి ఆ సొమ్మును లాయర్‌గారికి ఇప్పించారట?! అదీ సంగతి!

కార్టూన్ కదంబం


పట్టణాలతో గ్రామాలను అనుసంధానం చేయాలి
-కలాం


తెహల్కా వాళ్లట సార్, కనీసం మేమెన్నా తెలుసా అని అడుగుతున్నారు!
తెల్గి ఎవరో నాకు తెలియదు:

దేశం

నేర్పుతాం ఇంగ్లీషు ఈజీగా, మాట్లాడండి ఇక దాన్ని హాయిగా!

ఎలా అంటారా? ఎంతో లేదండీ కేవలం 750 ఇంగ్లీషు పదాలు తెలుసుకుంటే చాలు. మీరు రోజూ మాట్లాడే సంభాషణలను అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడవచ్చు.

ఇప్పటికే ఇందులోని కొన్ని పదాలను మీకు తెలియకుండానే మీరు ఉపయోగిస్తున్నారు.

ఇక సందర్భానుసారంగా ఏ ఏ పదాలను ఎలా ఎక్కడ అర్థమయ్యేలా ఉపయోగించాలో నేర్పించటమే మా వంతు. ఇది తెలుసుకుంటే చాలు. మీరు కూడా హాయిగా ఇంగ్లీషులో మాట్లాడగలుగుతారు.

దీనికనుగుణంగా ఈ శిక్షణను గత **23** సంవత్సరాలుగా మేము అందిస్తున్నాం.

మరో విశేషమేమిటంటే ఈ శిక్షణ విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు మరియు గృహిణులు ఇలా అన్ని రంగాల వారికి ఎంతో ఉపయోగకరం.

శిక్షణ పాఠాలను మీ తీరిక వేళలో శ్రద్ధగా ప్రతిరోజు ఒక అరగంట మాత్రం చదివి ప్రాక్టీసు చేస్తే చాలు. 60 రోజులలో మీరు కూడా సరళంగా ఇంగ్లీషు మాట్లాడటం ప్రారంభిస్తారు.

ఈ శిక్షణ ద్వారా ఇప్పటికే **16** లక్షలకు పైబడినవారు ఇంగ్లీషులో సరళంగా మాట్లాడే అవకాశం పొందగలిగారు. ఇక ఇప్పుడు ఈ అవకాశం మీకే !

దీనికి మీరు చేయవలసిందల్లా ఒక్కటే. క్రిందవున్న కూపను పూర్తి చేసి పంపండి. శిక్షణకు కావలసిన పాఠాల ప్యాకేజ్ **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తుంది.

మరచిపోకండి. కూపను వెంటనే పంపండి.

ఇదిగో కూపన్

Yes! నేనూ ఇంగ్లీషులో సరళంగా మాట్లాడాలనుకుంటున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా పంపండి. పోస్టుమేన్‌కి **రూ. 575/-** చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

పేరు: ....

వయసు: .... ఆడ ☐ మగ ☐

చిరునామా: ....

....

.... పిన్‌కోడ్ ....

VIVEKANANDA INSTITUTE
9, Madley Road, T.Nagar, Chennai-600017.

PS-1

VIVEKANANDA INSTITUTE

INDIA'S No.1 ENGLISH TRAINING INSTITUTE

08 / TEL / 04 / NAGA

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (S.R.NAGAR ☎ 23714330. DILSUKHNAGAR ☎ 24044352. VANASTHALIPURAM ☎ 24122464. MEHDIPATNAM ☎ 55755888. A.S.RAO NAGAR ☎ 55497992. NARAYANAGUDA ☎ 55155441). RAJAMUNDRY ☎ 2422003. KAKINADA ☎ 2386638. VISAKHAPATNAM ☎ 2738892. VIJAYAWADA ☎ 5530053. GUNTUR ☎ 2238541. NELLORE ☎ 2327702. THIRUPATI ☎ 2252878. CUDDAPAH ☎ 224445. MIRYALGUDA ☎ 230130. ANANTAPUR ☎ 241029. KURNOOL ☎ 248099. NIZAMABAD ☎ 235767. PRODDATUR ☎ 250550.



ఏథెన్స్ టు ఏథెన్స్

హసన్ షరీఫ్



ఒలింపిక్స్ అనగానే ప్రాచీన గ్రీకు సామ్రాజ్యం గుర్తొస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్తలు, శాస్త్రవేత్తలు అయిన ప్లేటో, సోక్రటీస్, అరిస్టాటిల్, ప్రపంచాన్ని జయించేందుకు బయల్దేరిన గ్రీకువీరుడు అలెగ్జాండర్ పేర్లు గుర్తుకు వస్తాయి. ప్రపంచానికి ఎందరో గొప్ప వ్యక్తులను అందించిన గ్రీకు సామ్రాజ్యమే విశ్వమానవాళి అంతా ఒకచోట చేరి అన్నీ మరచిపోయి ఆటాడుకునే ఒలింపిక్స్‌ను కూడా అందించింది. **2700** సంవత్సరాల క్రితం ఏథెన్స్‌లో ఈ క్రీడలు ప్రారంభం కాగా, ఆధునిక క్రీడలు కూడా **1896**లో ఏథెన్స్‌లో పునఃప్రారంభమయ్యాయి. వందేళ్ళు దాటినా ఒలింపిక్స్ పట్ల విశ్వజనుల్లో మోజు తగ్గలేదు. ఎప్పటికప్పుడు వాటిని నిర్వహించడానికి అనేక దేశాలు పోటీపడుతున్నాయి. వేలకోట్లు ఖర్చు పెట్టి నిర్వహిస్తూ ప్రపంచం ముందు తమ దేశ క్రీడాస్ఫూర్తిని చాటుకుంటున్నాయి. ఏథెన్స్‌లో పుట్టి అక్కడే పునఃప్రారంభమై మళ్ళా ఆ ప్రాచీన నగరంలోనే వచ్చే నెలలో ఒలింపిక్స్ క్రీడలు జరుగుతున్న సందర్భంగా....

విశ్వమానవ క్రీడలుగా పేరుపొందిన ఒలింపిక్స్ ప్రతి నాలుగేళ్ళకోసారి (లీపు సంవత్సరంలో) జరుగుతాయి. తొలి ఆధునిక ఒలింపిక్స్ 1896లో ఏథెన్స్‌లో జరిగాయి. మళ్లీ 108 సంవత్సరాల తర్వాత మరో నెలరోజుల్లో ఏథెన్స్‌లో భారీ ఎత్తున జరగబోతున్నాయి. తొలి ఒలింపిక్స్‌లో 14 దేశాలకు చెందిన 200 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు. పోటీలు తొమ్మిది క్రీడాంశాల్లో జరిగాయి. ఐదు ఖండాలకు గుర్తుగా ఒలింపిక్ పతాకంలో ఐదు రింగులు కనిపిస్తాయి.

ఎలా ప్రారంభమయ్యాయి?

పూర్వకాలంలో పండుగల సమయాల్లో మాత్రమే ఆటలపోటీలు నిర్వహించేవారు. గ్రీకు దేవుడు "జీయస్" పేరిట క్రీస్తు పూర్వం 776వ సంవత్సరంలో ఆటలపోటీలను నిర్వహించినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో 200 గజాల పరుగుపందెంలో గెలుపొందిన ఆటగాడు ఒలింపిక్ జ్యోతిని వెలిగించేవాడు. పోటీలు ఐదు రోజులపాటు జరిగేవి. తొలిరోజు ప్రారంభోత్సవ వేడుకలు, చివరి రోజు విజేతలకు బహుమతులు, ముగింపు ఉత్సవాలు జరిగేవి. రెండోరోజు పరుగు పందెం నిర్వహించేవారు. మూడవ, నాల్గవ రోజుల్లో మిగిలిన క్రీడలు నిర్వహించేవారు. రోమన్ కొత్త చక్రవర్తిగా వచ్చిన థియోడర్ పోటీలను నిషేధించడంతో ఒలింపిక్ క్రీడలు ఆగిపోయాయి. దీన్ని పునరుద్ధరించడానికి 1500 సంవత్సరాలు పట్టింది.

ఆధునిక ఒలింపిక్

ఈ క్రీడలు పునఃప్రారంభానికి ఎవరూ ముందుకు రాలేదు. ఖర్చుతో కూడుకున్న క్రీడలను నిర్వహించడానికి ఏ దేశం కూడా సిద్ధంగా లేదు. ఫ్రాన్స్‌లోని సోర్బానే నగరంలో "వ్యాయామం" అనే అంశంపై జరిగిన సమావేశంలో ఒలింపిక్ క్రీడల పునఃప్రారంభానికి ఇటలీ దేశస్థుడు బారోన్ పైరేడి కోబర్టిన్ (ఫ్రాన్స్‌లో స్థిరపడ్డాడు) బీజం వేశాడు. ఒలింపిక్ క్రీడల పునరుద్ధరణ వల్ల దేశాల మధ్య స్నేహసంబంధాలు, వ్యాపార లావాదేవీలు మెరుగుపడతాయని పిలుపునిచ్చాడు. 1892లో పారిస్‌లో జరిగిన సమావేశంలో ఒలింపిక్స్‌ను పునఃప్రారంభించాలని అన్ని దేశాలు నిర్ణయించి ఒలింపిక్ కమిటీని ఏర్పాటు చేశాయి. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి వేర్వేరు దేశాల్లో నిర్వహించాలని అప్పుడే నిర్ణయించారు. 1896లో ఏథెన్స్‌లో నిర్వహించిన తొలి ఒలింపిక్స్‌లో 14 దేశాలకు


ప్రధాన స్టేడియం







భారత్‌లో పతకాల వీరులు

108 సంవత్సరాల చరిత్ర కలిగిన ఒలింపిక్స్‌లో భారత్‌కు పతకాలు అందించిన వారు బహుకొద్దిమంది మాత్రమే. టెన్నిస్ ఆటగాడు లియాండర్ పేస్ (1996), వెయిట్ లిఫ్టర్ కరణం మల్లేశ్వరి (2000) మాత్రమే దేశానికి వ్యక్తిగత విభాగంలో పతకాలు అందించారు. వీరికన్నా ముందు మరో ఇద్దరు భారత ఆటగాళ్లు పతకాలు సాధించారు. పారిస్ ఒలింపిక్స్ (1900)లో కొల్‌కతాకు చెందిన నార్మన్ పిచ్చర్డ్ (ఆంగ్లో ఇండియన్) 200 మీటర్ల రన్నింగ్, 200 మీటర్ల హర్డిల్స్‌లో రజిత పతకాలు సాధించాడు. అయితే వ్యక్తిగతంగా పాల్గొనడంతో భారత్‌కు పతకం అందించిన రికార్డుల్లో అతని పేరు చోటుచేసుకోలేదు. హెల్సింకీ ఒలింపిక్స్ (1952)లో ఫ్రీ స్టయిల్ కుస్తీలో (బాంటమ్ వెయిట్) రజితం సాధించిన వస్తాదు కాసభా జాదవ్. 1952 తరువాత భారత్ 44 సంవత్సరాల పాటు పతకం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. 1996లో లియాండర్ పేస్ (టెన్నిస్ సింగిల్స్) కాంస్యం సాధించాడు. 2000లో కరణం మల్లేశ్వరి (వెయిట్ లిఫ్టింగ్) కూడా కాంస్యం సాధించింది. ఏథెన్స్‌లో భారత హాకీ జట్టు పతకంపై ఆశలు పెట్టుకుంది. అయితే వెటరన్ ఆటగాడు ధనరాజ్ పిళ్లేను ఏథెన్స్‌కు పంపకూడదని భారత హాకీ సమాఖ్య భావించడంతో ఇటీవల వివాదం నెలకొంది. ఎట్టకేలకు ఒత్తిడికి తలొగ్గి అతన్ని ఎంపికచేసినప్పటికీ ఆటగాళ్లలో స్ఫూర్తి దెబ్బతిన్నది. సిడ్నీ ఒలింపిక్స్‌లో ఫైనల్ వరకూ వెళ్లిన షూటర్ అంజలీ వేద్‌పాఠక్ ఈసారి పతకాన్ని 'షూట్' చేసే అవకాశాలున్నాయి. సిడ్నీ కాంస్య పతక విజేత కరణం మల్లేశ్వరి ఈసారి స్వర్ణంపై గురిపెట్టి భారీ ప్రాక్టీసు చేసింది. ఆమెకు తోడు కుంజారాణి దేవి కూడా పతకంపై గురిపెట్టింది. చాలా కాలం తర్వాత మళ్లీ కలిసి ఆడనున్న లియాండర్ పేస్, మహేశ్ భూపతిలు టెన్నిస్ డబుల్స్‌లో పతకంపై ఆశలు నిలిపారు. ఇటీవల అద్భుతంగా రాణిస్తున్న బాక్సర్లు, ఆర్చరీ ఆటగాళ్లు ఒక్క పతకమైనా సాధించాలనే పట్టుదలతో ఉన్నారు. బాక్సింగ్‌లో తొలిసారి సర్వీసెస్ నుండి ఒక్కరు కూడా ఎంపిక కాలేదు. లాంగ్‌జంప్‌లో అద్భుతాలు సృష్టిస్తున్న అంజూ జార్జ్ ఒలింపిక్ పతకం సాధించనిదే నిద్రపోనని చెప్తోంది. హెప్టాథ్లాన్‌లో నిలకడగా రాణిస్తున్న జెజె శోభ కనీసం ఫైనల్ వరకైనా వెళ్తానని ఢంకా బజాయించి చెప్తోంది.



చెందిన 200 మంది పురుషులు పాల్గొన్నారు. మహిళలకు ప్రాతినిధ్యం లభించలేదు. తొమ్మిది రకాల క్రీడల్లో (అథ్లెటిక్స్, వెయిట్ లిఫ్టింగ్, కుస్తీ, ఫెన్సింగ్, షూటింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఈత పోటీలు, టెన్నిస్) 43 ఈవెంట్స్‌పై పోటీలు జరిగాయి. ఐదు దేశాలకు మాత్రమే పతకాలు లభించాయి. అప్పటి నుండి ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. 108 సంవత్సరాల తర్వాత మళ్లీ ఆధునిక ఒలింపిక్స్ గ్రీకు రాజధాని ఏథెన్స్‌లో జరగనున్నాయి.

ఒలింపిక్స్ లక్ష్యం

ఒలింపిక్ క్రీడల లక్ష్యం 'వేగం, ఉన్నతి, పటిష్టం'. పారిస్‌లో స్కూల్ హెడ్‌మాస్టర్ అయిన ఫాదర్ డైడన్ దీనిని రూపొందించాడు. క్రీడలు విద్యార్థుల్లో ధైర్యసాహసాలు, మనోవికాసం, ఆత్మస్థయిర్యం కలిగి స్తాయని నమ్ముతూ విద్యార్థులకు ఆటల్లో ఆసక్తి కలిగించ డానికి కృషి చేసిన కోబర్టిన్, డైడన్‌కు స్నేహితుడు. 1920 లో బెల్జియంకు చెందిన అంట్వెర్ప్‌లో జరిగిన ఏడవ ఒలిం పిక్ క్రీడల సందర్భంగా దీనిని తొలి సారి ప్రయోగించారు.

ఒలింపిక్ చిహ్నం

ఒకదానితో ఒకటి కలిసిన ఐదు రింగుల గొలుసు ఒలింపిక్ చిహ్నం. ఒక్కొక్క రింగు ఒక్కొక్క రంగును కలిగి ఉంటుంది. నీలం, పసుపు, నలుపు, ఆకు పచ్చ, ఎరుపు అనే అయిదు రంగుల్లో ప్రపంచంలోని ఒక్కొక్క ఖండానికి ప్రతి రూపంగా ఈ రింగులుంటాయి. ప్రపంచంలోని ఏ దేశపు జాతీయ జెండా రంగు అయినా ఈ అయిదు రంగుల్లో ఏదో ఒక దానిని కలిగి ఉండడమే వీటి ప్రత్యేకత.

పతాకం

ఒలింపిక్ పతాకాన్ని 1913లో రూపొందించారు. 1914లో పారిస్‌లో దీనిని తొలి సారి ఆవిష్కరించారు. పతాకం మూడు మీటర్ల పొడవు, రెండు మీటర్ల వెడల్పున్న తెల్లని పట్టు వస్త్రంతో తయారై ఉంటుంది.

మస్కట్

ఒలింపిక్ మస్కట్‌ను మ్యూనిచ్ నగరంలో (1972లో 20 ఒలింపిక్ క్రీడల సందర్భంగా) తొలిసారి రూపొందించారు. అప్పటి నుంచీ ప్రతీ క్రీడోత్సవాలలోనూ దీనిని ప్రత్యేకంగా రూపొందిస్తున్నారు. క్రీడలను నిర్వహించే దేశమే దీనిని తన సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగానో లేక తమ ప్రజలకిష్టమైన జంతువులనో మస్కట్‌గా రూపొందించుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

ఒలింపిక్ జ్యోతి

'పవిత్ర పోటీ, స్నేహం, శాంతి, విద్య, సంస్కృతి'కి చిహ్నం ఒలింపిక్ టార్చ్. ప్రాచీన ఒలింపిక్ క్రీడలు జరిగినన్ని రోజులూ దీనిని 'హేరా' అనే దేవత ముందు ఆరిపోకుండా వెలిగిస్తూ ఉండేవారు. అందుకే ఒలింపిక్ జ్యోతిని ఇప్పటికీ అత్యంత పవిత్రమైనదిగా భావిస్తున్నారు. ఒలింపిక్ జ్యోతి ప్రాచీన, ఆధునిక ఒలింపిక్ క్రీడలను అనుసంధానపరిచే సాధనంగా భావిస్తారు. ఆధునిక ఒలింపిక్ జ్యోతిని ఆమ్‌స్టర్ డామ్ నగరంలో 1928లో జరిగిన ఒలింపిక్ క్రీడల సందర్భంగా తొలిసారి వెలిగించారు. క్రీడలు జరుగుతున్న స్టేడియం ముందు భాగంలో పెద్ద టార్చ్‌ను రూపొందించి దానిలో జ్యోతిని వెలిగించారు. అయితే ప్రస్తుత విధానం మాత్రం బెర్లిన్ నగరంలో 1936లో జరిగిన క్రీడల సందర్భంగా వచ్చింది.

తొలిసారి జరిగిన టార్చ్ రిలేలో మూడు వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నేటికీ జ్యోతిని ఒలింపియాలో వెలిగించి క్రీడలు జరుగుతున్న స్టేడియానికి తీసుకువస్తారు. ఒలింపిక్ జ్యోతిని పట్టుకుని చేసే ప్రయాణాన్ని 'టార్చ్ రిలే'గా పిలుస్తారు. ఈ కార్య క్రమానికి కార్ల్‌డీమ్ రూపకల్పన చేశాడు. ఈ రిలేలో క్రీడా కారులే కాకుండా ఆయా దేశాల్లోని ప్రముఖులు, ప్రజలు కూడా పాల్గొంటారు. క్రీడాకారులు దీనిలో పాల్గొనడం ప్రతిష్టాకరంగా భావిస్తారు. అందులోనూ చివరకు తమ చేతుల ద్వారా స్టేడియానికి తీసుకుని వచ్చి అక్కడ నిలపడం తమ అదృష్టంగా చెప్పుకుంటారు. 1976లో మాంట్రియల్‌లో జరిగిన 21వ ఒలింపిక్ క్రీడల సందర్భంగా దీనిని లేజర్ బీమ్ ద్వారా వెలిగించారు. అలాగే 1992లో జరిగిన బార్సిలోనా ఒలింపిక్స్‌లో స్పెయిన్‌కు చెందిన అథ్లెట్ (విలుకాడు) యాంటోనియో రెబెల్లొ బాణం చివర మంటలు రగిలించి గురిపెట్టి నిర్ణీత ప్రదేశంలో ఉన్న ఒలింపిక్ జ్యోతిని వెలిగించాడు. ప్రస్తుతం సూర్యకిరణాలతోనే జ్యోతిని వెలిగిస్తున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన దుస్తులు ధరించిన గ్రీకు కన్యలు సూర్య కిరణాలను శక్తివంతమైన భూతద్దం ద్వారా ప్రసరింప జేసి జ్యోతిని ఏథెన్స్‌లోని ఒలింపియాలో జూన్ మూడవ తేదీన వెలిగించారు. అక్కడి నుండి జ్యోతిని పట్టుకున్న క్రీడా కారులు ఒకరి నుంచి ఒకరు అందుకుంటూ నదులు, సముద్రాలు దాటుతూ పయనించి చివరకు విమాన మార్గం ద్వారా ఒలింపిక్ క్రీడలు జరుగుతున్న స్టేడియానికి చేరుస్తారు. ఈ టార్చ్ 27 దేశాల్లోని 33 నగరాల్లో 78 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణం చేసి ఆగస్టు 13వ తేదీన ఒలింపిక్స్ పోటీలు జరిగే ఏథెన్స్ నగరానికి చేరుతుంది. టార్చ్ న్యూఢిల్లీకి జూన్ పదవ తేదీన వచ్చింది.

ఒలింపిక్ పురస్కారాలు

తొలినాళ్ళ ఒలింపిక్ క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు దేవతకు బలిచ్చిన జంతువు మాంసాన్ని అందజేసేవారు. అటు తరవాత కాలంలో ఆలివ్ ఆకులతో తయారు చేసిన కిరీటాన్ని బహూకరించ

దంతో పాటు వారి పేరును క్రీడల్లో పాల్గొన్న దేశాల్లో చాటింపు వేయించే వారు. ఆధునిక క్రీడల్లో పాల్గొని గెలుపొందిన క్రీడాకారులకు పతకాలు, సర్టిఫికేట్‌లను పురస్కరిస్తున్నారు.

పతకాలు

పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం పొందిన వారికి బంగారు పతకాన్ని బహూకరిస్తారు. 60 మిల్లీ మీటర్ల వ్యాసం, మూడు మిల్లీ మీటర్ల మందం కలిగి ఉండే ఈ పతకాన్ని 92.5 శాతం వెండి, ఆరు గ్రాముల బంగారంతో తయారు చేస్తారు. రెండవ బహుమతిగా ఇచ్చే వెండి పతకం స్వచ్ఛమైన వెండితో తయారు చేస్తారు. మూడవ బహుమతిగా ఇచ్చే పతకాన్ని కంచుతో తయారు చేస్తారు. పతకాలపై ఆటగాళ్లు పాల్గొన్న క్రీడాంశం పేరు ఉంటుంది. దాని వెనుక వైపున గ్రీకుల దేవత అయిన హెలీ చేతిలో ఆకులు, పూలతో తయారు చేసిన మాలను పట్టుకుని ఉన్న చిత్రం, దాని బ్యాక్ గ్రౌండ్‌లో ఏథెన్స్‌లో స్టేడియంతో కూడిన చిత్రముంటుంది. 1972 నుండి క్రీడోత్సవాలను నిర్వహిస్తున్న దేశాలు తాము సొంతంగా డిజైన్ చేసుకున్న బొమ్మలను పతకాలపై చిత్రించుకోవడానికి అనుమతిస్తున్నారు. ఈ పతకాలతో పాటు ఒలింపిక్ క్రీడల్లో పాల్గొన్న వారికి, ఒలింపిక్ స్ఫూర్తిని విస్తరించడానికి కృషి చేస్తున్న వారికి వివిధ రకాల అవార్డులు, ట్రోఫీలను కూడా బహూకరిస్తున్నారు.

ఒలింపిక్స్‌లో ఆఫ్ఘాన్

తాలిబాన్ పాలనలో ఆఫ్ఘనిస్తాన్‌లో క్రీడలు నిర్వహించలేదు. క్రీడా మైదానాలు, స్టేడియాలు బీడువారి పనికిరాకుండా పోయాయి. తాలిబాన్‌ల పాలన అంతమైన తర్వాత ఆఫ్ఘాన్‌లో క్రీడలు ఊపు అందుకున్నాయి. పతకాలపై ఆశ లేకున్నా, ఒలింపిక్స్‌లో పాల్గొనాలన్న ఏకైక లక్ష్యంతో 11 మంది ఆటగాళ్లు ముమ్మరంగా ప్రాక్టీసు చేస్తున్నారు. ఈ బృందానికి 17 సంవత్సరాల అమ్మాయి రుబీనా ముకిమ్‌యార్ నాయకత్వం వహించనుంది. ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న తొలి ఆఫ్ఘన్ మహిళగా కూడా ఆమె రికార్డు నెలకొల్పనుంది. రుబీనాతో పాటు మరో మహిళకు కూడా ఆఫ్ఘాన్ జట్టులో చోటు దక్కింది. ఆమె పేరు ఫ్రిబారెజిహికి. రుబీనా అథ్లెటిక్స్‌లో, ఫ్రిబారెజిహికి జూడోలో పోటీ పడనున్నారు. ఆఫ్ఘన్లు చివరిసారిగా 1992 ఒలింపిక్స్‌లో పాల్గొన్నారు.

2012 సంవత్సరంలో జరిగే ఒలింపిక్స్ నిర్వాహణకు 10 దేశాలు పోటీ పడుతున్నాయి. అయితే ఇందులో హవానా, రియోడిజనీరో, ఇస్తాంబుల్, లీప్ జిగ్‌లను అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం తప్పించింది. దీంతో రేసులో ఐదు దేశాలే (పారిస్, న్యూయార్క్, మాస్కో,

లండన్, మాడ్రిడ్) మిగిలాయి. పారిస్‌లో 1924లో, లండన్‌లో 1948లో, మాస్కోలో 1980లో చివరిసారిగా జరిగాయి. 2012 ఒలింపిక్స్ పోటీల వేదికను వచ్చే సంవత్సరం జులైలో ప్రకటిస్తారు.

ఏథెన్స్‌కు భారత గిటారిస్టు గౌరవ్

గ్రీస్ రాజధాని ఏథెన్స్ ఒలింపిక్స్‌లో జరిగే సాంస్కృతిక కార్యక్రమానికి కొల్‌కతాకు చెందిన గౌరవ్ ముజుందార్ ఎన్నికయ్యాడు. పతకాలు బహూకరించే సమయంలో వివిధ దేశాలకు చెందిన నేపథ్య సంగీతాన్ని అందించే బాధ్యత ఇక గౌరవ్ ముజుందార్‌పై వుంది. వాస్తవానికి భారత్ తరఫున తొలుత అనుష్కాను ఎంపిక చేశారు. అయితే పండిత్ రవిశంకర్ కుమార్తె అయిన అనుష్కా అందుబాటులో లేకపోవడంతో ఒలింపిక్ నిర్వాహకులు గౌరవ్ ముజుందార్ పేరును ఖరారు చేశారు. ఏథెన్స్‌కు ఎంపికైన ఏకైక భారత కళాకారుడు గౌరవ్.

మనమెందుకు వెనకబడ్డాం?

దేశంలోని వివిధ క్రీడా సమాఖ్యలను రాజకీయ నాయకులు తమ సొంత ఆస్తిగా తయారు చేసుకున్నారు. సమాఖ్య అధ్యక్షులుగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన ఈ నాయకులు ఆయా క్రీడల అభివృద్ధికి కృషి చేయకుండా తమ సొంత ఆస్తులను పెంచుకోవడం పైనే దృష్టి కేంద్రీకరిస్తున్నారు. దీంతో ఒలింపిక్స్‌తో సహా అంతర్జాతీయ పోటీల్లో పతకాలు భారత్‌కు అందని ద్రాక్షపండుగానే ఉంటున్నాయి. ప్రభుత్వం నుండి లభిస్తున్న గ్రాంట్‌ను ఖర్చు చేస్తున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం క్రీడల మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడం లేదు. ఒలింపిక్స్‌లో పి.టి.ఉష కనబర్చినదే ఇప్పటి వరకు భారత అథ్లెట్ అత్యుత్తమ ప్రతిభ ఉష 1984 ఒలింపిక్స్‌లో ఫైనల్ వరకూ చేరుకొని సెకన్‌లో వందోవంతు తేడాతో కాంస్య పతకం కోల్పోయింది. సిడ్నీ ఒలింపిక్స్‌లో బీనామోల్ సెమీస్‌కు వెళ్లింది.

భారత హాకీ సమాఖ్యకు గత పదకొండు సంవత్సరాలుగా నేతృత్వం వహిస్తున్న ఐపిఎస్ అధికారి కెపిఎస్ గిల్ వివాదాలకు కేటాయించిన సమయాన్ని హాకీ అభివృద్ధికి కేటాయించలేకపోయారు. ఏక సభ్య సెలెక్షన్ కమిటీ ద్వారా జట్టును ఎంపిక చేయడం, కోచ్‌ల అతి ప్రవర్తన, ఆటగాళ్ల సామరానీఖ్యనికి ప్రాముఖ్యత ఇవ్వకపోవడం వంటి చర్యల వల్ల భారత హాకీ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా తయారైంది. స్వాతంత్ర్యం లభించిన తర్వాత వరుసగా ఎనిమిది ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించిన రికార్డు కలిగిన భారత్ ఇటీవల సెమీఫైనల్స్‌కు చేరడమే గగనంగా మారింది.

క్రీడాధికారుల్లో సురేశ్ కల్మాడీకి ప్రత్యర్థిగా ముద్రపడిన మాజీ ఎంపి అభయ్ చౌతాలా భారత్ బాక్సింగ్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ పదవిలో ఈయన కూడా చాలా కాలం కొనసాగేందుకు తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. అలీ ఖమర్, డింకోసింగ్, గుర్‌శరణ్ సింగ్ వంటి ఉత్తమ బాక్సర్ల అభివృద్ధికి అసోసియేషన్ ఎటువంటి కృషి చేయడం లేదు. సిడ్నీలో గుర్‌శరణ్ సింగ్ క్వార్టర్ ఫైనల్స్ వరకూ వెళ్లడమే 1948 నుండి ఒలింపిక్స్‌లో భారత్ బాక్సింగ్ అత్యుత్తమ ప్రతిభ. మాజీ పార్లమెంట్ సభ్యుడు అజయ్ చౌతాలా (అభయ్ అన్నయ్య) టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడిగా గత 20 ఏళ్లుగా కొనసాగుతున్నాడు. 1979లో 16 ర్యాంకుల లోపు స్థానం సంపాదించిన భారత టిటి జట్టు ఇటీవల 30వ ర్యాంకుకు దిగజారింది. సింగిల్స్‌లో 200 లోపు ర్యాంకుల్లో ఇద్దరు భారత ఆటగాళ్లు మాత్రమే స్థానం సంపాదించగలిగారు. 1988 నుండి ఒలింపిక్స్‌లో ఆడుతున్న భారత్ రెండోరౌండ్‌కు కూడా చేరుకోలేకపోయింది. ◆



తొలి ఆధునిక ఒలింపిక్స్ ప్రారంభ దృశ్యం

ఇంతవరకు ఎన్ని జరిగాయి?

ఆధునిక ఒలింపిక్స్ 1896లో గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ప్రారంభమయ్యాక నాలుగు సంవత్సరాలకు ఒకసారి వివిధ దేశాలలో జరుగుతూ వస్తున్నాయి. 1916లోనూ ఆ తరువాత 1940, 1944లోనూ పోటీలు జరగలేదు. పోటీలను ఒకటి కంటే ఎక్కువసార్లు నిర్వహించిన దేశాలలో అమెరికా ముందుంది. అమెరికా నాలుగు, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, జర్మనీ రెండేసి సార్లు నిర్వహించాయి. 2016 ఒలింపిక్స్ బిడ్ కోసం భారత్ పోటీ పడుతోంది. 2008 ఒలింపిక్స్ పోటీలను బీజింగ్ (చైనా)కు కేటాయించారు.

1896	ఏథెన్స్ (గ్రీస్)
1900	పారిస్ (ఫ్రాన్స్)
1904	సెయింట్ లూయిస్ (అమెరికా)
1908	లండన్ (ఇంగ్లండ్)
1912	స్టాక్‌హోం (స్వీడన్)
1916	జరగలేదు
1920	బెల్జియం
1924	పారిస్ (ఫ్రాన్స్)
1928	ఆన్స్‌ట్రడామ్ (హాలెండ్)
1932	లాస్ ఏంజిల్స్ (అమెరికా)
1936	బెర్లిన్ (జర్మనీ)
1940, 1944లలో జరగలేదు	
1948	లండన్ (ఇంగ్లండ్)
1952	హెల్సెంకి (ఫిన్‌లాండ్)
1956	మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)
1960	రోమ్ (ఇటలీ)
1964	టోక్యో (జపాన్)
1968	మెక్సికో (మెక్సికో)
1972	మ్యూనిక్ (పశ్చిమ జర్మనీ)
1976	మెంటిరియాల్ (కెనడా)
1980	మాస్కో (రష్యా)
1984	లాస్ ఏంజిల్స్ (అమెరికా)
1988	సోయల్ (దక్షిణ కొరియా)
1992	బార్సిలోనా (స్పెయిన్)
1996	అట్లాంటా (అమెరికా)
2000	సిడ్నీ (ఆస్ట్రేలియా)
2004	ఏథెన్స్ (గ్రీసు)
2008	బీజింగ్ (చైనా)

బోరు

"... గా ట్రంకు పెట్టి ముట్టుకున్నవంటె పొనందీస్త - నీకెన్నిసార్లు చెప్పిన్నే దానితాన పోవద్దని... సుతాం చెప్పుడు నా చాతకాదు - హమ్మ" ఎల్లారెడ్డి భార్య కమలమ్మని చడామడా కసిరిండు - ఆవిడ మొఖం చిన్న చేసుకుని మూతివిరిచి వాకిట్లో కూలబడింది.

బయట వేడి వడగాలి కమ్మరి పుల్లన్న కొలిం కొట్టంలో నుండీ వస్తున్న సెగలా అంటుకుంటుంది. ధగద్ధగ మెరుస్తున్న ఎండ! ఆకాశంలో ఒక్క మెయిలు లేదుగదా... తళతళ తోమిన రాతెండి గిన్నెలా మెరిసిపోతుంది. వేడికి చెవులపొంటె ఆవిర్లు చిమ్ముకొస్తున్నాయి.



రుక్మిణి

ఎల్లారెడ్డి మొఖం నిండా చెమట పట్టింది. గొంతంత తడారిపోయి యమ చికాగ్గా వుంది. రాత్రేం జరిగింది? జరిగింది తలుచుకుని కాసేపు ఎల్లారెడ్డి కుమిలిపోయిండు. సాయంత్రం చేను కానుండి వుస్సురుస్సురని వచ్చి ఇంట్లో బల్లం పీటమీద కూలబడ్డడు. పెద్దకొడుకు వీరారెడ్డి పత్తిచేను గురించి, రెండెకరాల పునాస గురించి ముచ్చట చెప్తున్నాడు. అంగో అపుడు తడాల్మని మెరుపు ఆ సంధ్యా చీకట్లో మెరవనే మెరిసింది. దాని వెంటే పెళపెళమని ఊరుమీద పిడుగులో బాంబులో పడ్డట్టు వురుము వురిమింది. వీరారెడ్డి ఇంటిబయటకు వురికి వచ్చి చీకట్లో ఆకాశం వంక చూసి ఒక్క కేక బెట్టిండు - 'బాపూ... పూరాగా మబ్బులు కమ్మినై... మరో సిడెంలో బ్రెమ్మాండమైన వాన..." అంటూ వాడు మాట కానిచ్చేలోగానే తడాల్మని మెరుపు... దఢదఢ... వురుము వురిమింది.

కమలమ్మ వుక్కిరిబిక్కిరై "వామ్మో... వామ్మో వానవాసన... వానవాసన" అని ఆనందంగా ఇంటి నిండా కెలదిరిగింది. ఎల్లారెడ్డి ఛాతీ పొంగిపోయింది. నోటమాట రాక... నేల మీద కాళ్ళానక బల్లమీద నుండి దిగ్గున లేచిండు.

"వానగాలేరా... హమ్మయ్య" అని కొడుకు వీరారెడ్డిని ఆ చీకట్లోనే వెనక దొడ్లోకి తోడుకుపోయి కోళ్ళ గూట్లో నుండి మంచి పుంజునొకదాన్ని బయటకు గుంజిండు. వెంటనే దానిమెడ తప్పిచ్చి బూరుపీకి, కాపి, కమలమ్మ కందించిండు. బయట మెరుపుల వురుముల సయ్యాట సాగుతూనే వుంది.

ఆ మన్నెగూడెం గ్రామంలోని రైతులు ఇండ్ల నుండి బయట అరుగుల మీదికురికి ఎపుడు వాన స్టార్టయితే అపుడు తడిసిపోవడానికి తయారై పోయింగ్రు - మెరుస్తున్న మెరుపుల వంక మెరిసే కళ్ళతో, వురిమే వురుములకు గుండెలు బిగబట్టుకుని కొండవైపే చూస్తంగ్రు.

ఎల్లారెడ్డి కమలమ్మలు కొడుకుల్తో కలిసి కోడికూర తింటూ కురవబోయే భారీ వానను తలుచుకుంటూ సంబరంగా బల్లంపీట మీద కూకుని వాకిలిగుండా చీకట్లోకి చూస్తున్నారు.

మెరుపులు ఆగిపోయినై - వురుముల పత్తా లేదు.

ఎల్లారెడ్డి బల్లమీద వెనక్కిజారగిలబడి వూరికే కమలమ్మ మీద ఎగిరిపడి బూతులకు తగులుకున్నాడు. బయట వానవాసన పోయి వేడి వడగాలి ఒక్కసారి తగులుకుంది. కమలమ్మ ఇంగ ఆగలేక చడామడా మొగుడ్ని నాలుగు దులుపులు దులిపింది "నీ సంబరం కాలిపోను-బంగారమసంటి పుంజు - రేపు సుక్రారం ముత్యాలమ్మకు బోనాం పెట్టి కోస్తామనుకుంటి. పరపరా మెడదెంపి సంబరపడితివి. అవతల చేలు ఎండి వేలాడబడ్తుంటే నీకు కోడికూర కావాల్సొచ్చినాది. పితపబుద్ధులు... పితపకాలం... యాడ్నయిన సావండి - బొచ్చె పట్టుకుని బజార్నపడండి" కమలమ్మ అలిసిపోయి అలిగి ముడుచుకుని పండుకుంది.

రాత్రి జరిగింది తలుసుకుంటుంటే ముందు దుఃఖం కలిగింది. ఏం చెయ్యాలె. జరలేచి గట్టా తోటకాడికైనా, చేనుకాడికైనా పోదామంటే గుండె దస్సుమంటుంది. పసిబిడ్డల్లాటి పైరుమొక్కలు యాడగిలబడిపోతంటే కండ్లనీళ్ళు ఆగటం లేదాయె! ఏం చేసేది?

* * *

"నాయ్నా! నాయ్నా... బోరోలొచ్చింగ్రు..." చిన్నకొడుకు శివారెడ్డి ముడ్డిమీద నిక్కరు పైకి ఎగబీక్కుంట వురుక్కుంటూ వచ్చి చెప్పిండు. వాడి నిక్కరు వెనక పగిలి పిర్రలు కనపడుతున్నా వాడు ఖాతరు చెయ్యటం లేదు. ఎల్లారెడ్డి దిగ్గున లేచి తువాలందుకున్నాడు. బయట ఎండ నిప్పుల జడివాన కురిపిస్తుంది. వడగాలి చెంపలు పగలగొడతంది.

"యాడికేంది"? కమలమ్మ ఎర్రిదానిలా అడిగింది.

"బోరు బండొల్లొచ్చింగ్రు - నువ్వు బువ్వతిని మన చేను కాడికిరా! సరేగాని ఎన్నిబండ్లు వచ్చినైరా!" ఎల్లారెడ్డి కొడుకును అడిగిండు.

"అయిదు - మల్లా రెండో మూడో సుతవస్తయంట!" వాడు చెంగున ఎండలోని దునికిండు.

"మళ్ళా బోరు వేయిస్తవా?" కమలమ్మ పిచ్చిదానిలా అడిగింది.

"తప్పుతాదె... చెరువెండిపాయె - వానరాదాయె - గవర్మెంటు ఏందో కాలవలైతే దీసి కంట్రాక్టర్లకు పైసలిచ్చిందిగాని - నీళ్ళయితే వదలదాయె! ఇంకా రెండు మూడేండ్లు ఆగాల్నట - అప్పటిదనక ఏసిన పైర్లు బతికి బట్టకట్టాల్నా?" ఎల్లారెడ్డి పెళ్ళానికి ఓపిగ్గా సంజాయించిండు-

"సంబడం... ఇప్పటికి పదిబోర్లేసినవ్... ఇంట్లె తిండిగింజలు సుత అమ్ముకుంటిమి - లచ్చ రూపాయిలు అప్పు చేస్తివి. ఒక్క దాన్లోనూ సుక్క నీరు పడకపాయె - మల్లాబోర్లేంది? రేపో మాపో వానపడకపోదా... అయినా మల్లా యాడ్నుంచి పైసలు దెస్తవ్?"

కమలమ్మ మాట పూర్తికాకమునుపే ఎల్లారెడ్డి బయట మండుతున్న ఎండకన్నా ఇబ్బడిగా మండిపడ్డాడు.

"ఛు... ఆడమేళం... మనిషికి బతికి బట్టకట్టాల్నన్న ఆశుండాల్నె - ఆ ఆశేలేకపోతే అడివిలో చెట్టెంతో మనమంత! మల్లీ ఏస్తే నీళ్ళు పడవనే రూల్సు ఏమైనా వున్నయా... అరె... రైతుకు ఆశే ప్రాణం - మన పెద్దొర పట్నంల బ్యాంకిల నుండి మూడుకోట్లు అప్పు తీస్కుని యాపారం చేస్తండు. ఇక్కడ యగసాయం - రైతుకు అప్పులేకపోతే వాడు రైతెట్లయితడు? గంటాగి చేనుకాడికి అన్నం పట్కరా!" తువాలేసుకుని పోతున్న వాడల్లా "ఇంగో గా ట్రంకుపెట్టె ముట్టకు - అయినా తాళం చెవి నా దగ్గరుందిగానీ... తాళం పగలగొట్టేవు... వీపు విమానం మోత...!" నవ్వుతూ ఎల్లారెడ్డి ఎండలోకి

అడుగు పెట్టాడు.

* * *

ఊరుఊరంతా అల్లరల్లరిగుంది - వచ్చిన బోరుబండ్ల చుట్టూ రైతులు చేరి పోయింద్రు.

"మొన్న ఆదివారం నాటికే వస్తమన్నరు - గంత లేటయ్యిందేం?" ఊరబోయిన మొగిలి బోరు ఆపరేటర్ని నిలదీసిండు-

"అబ్బో... మస్తు డిమాండు - అస్సలు సిడెం తీరికలేదు - ఏదో గా దినం మాటిచ్చినం గనక ఇవ్వాలవచ్చినం! జల్ది కానియ్యండి... ఎవరెవ్వరికి ఎయ్యాల్నో జరచెప్తే పనిమొదలు పెడ్దాం..." ఆపరేటరు ఒక నోటుబుక్కు తీస్కుని రైతుల పేర్లు రాసుకుంటండు!

రైతులు బక్క చిక్కిన మొకాల్లో ఆశ....గుంటలు పడి పీక్క పోయిన కండ్లలో ఆశల మెరుపులు... కొందరైతే బోరుబండ్లను తృప్తిగా చేతుల్తో ముట్టుకుని ముచ్చట పడ్తంద్రు.

"నాలుగైదు రోజులు ఈడ్నె వుండాలె బోరుసారూ... చానా మందిమి బోర్లు ఏయించుకుంటం!" దెశబోయ్ని రంగయ్య తన రెండెకరాల చేను కండ్లలో మెదిలి నీళ్ళు గుక్కుకున్నాడు. ఈలోపున కొందరు సారయ్య దుకాణానికి పోయి కొబ్బరి కాయలు, ఊదు కడ్డీలు తెచ్చుకుని తయారైనారు - కొందరు గబగబ తలంట్లు తానాలు చేసి ఉండిన కొత్త బట్టల్తో తయారైంద్రు.

అయిదు బోరుబండ్లు దడదడమని పొలాల్లోకి బయలుదేరినై - ఎల్లారెడ్డి చాతీ పొంగిచ్చుకుని తన పత్తిచేను దగ్గరకు బోరుబండిని తీస్కపోయిండు. కమలమ్మ అదిరిపడే గుండెల్తో కొబ్బరి కాయందుకుని ఆదరా, బాదరగా వెంటపడ్డది. చిన్నకొడుకు పిర్రలు పగిలిన నిక్కరు ఎగబీక్కుంటూ గంతులేస్తు ఎంటబడ్డడు. వీరారెడ్డి అప్పటికే ఆడ కూకుని వున్నడు. కాలుస్తున్న బీడీ సప్పున ఆవలకు విసిరేసిండు.

ఒక పాయింటు సెలక్టు చేసి బోరు ఎయ్యటం మొదలు పెట్టింద్రు. "సిత్రం... గిప్పటికే పన్నెండు సోట్ల బోర్లేసినం... యాడకూడ సుక్క నీరు పడదాయె - లచ్చరూపాయలు - కరుకులు వదిలె..." కమలమ్మ తనలో తాను గింజుకుంటంది. ఎల్లారెడ్డి బోరువాండ్లను వుషారు చేస్తండు.

"రెండొందలడుగులకు గ్యారంటీ నీళ్ళు... దోసొబస్... ఫికర్ చేయకండి" బోరువాడు వుల్లాసం చెప్తండు. దడదడమని బోరు భూమి తల్లి గర్భంలోకి సొచ్చుకుంట దిగతంటే ఎల్లారెడ్డి గుండెల్ని అదింపట్టుకుని ఎర్రిగా చూస్తండు.

"క్యాఫికర్... అరె ఇస్కీ... జమీన్ జరాజరా లూజ్‌గానే వుంది పటేల్‌సాబ్... సౌఫీట్ దన్కా దిగింది.." బోరువాడు హోరెత్తినట్లు వాగుతండు.

కమలమ్మ చేన్లోకి పోయి దిగులుగా ఒక ఎత్తు గట్టుమీద కూలబడింది. మనసునిండా ముసురుకుంటున్న ఆలోచన్లు... ఈ బోర్లేంది? దబ్బులేంది... అప్పులేంది? తన చిన్నతనంలో వాన వరసబెట్టి కురిసేది - వాన పోంగానె చెరువులన్ని కలకలలాడేటివి. కొన్నయితే పార్లేవి. ఎన్నంటెగన్నినీళ్ళు - అసలా వానలేవీ... అసలీ బోర్ని కనిపెట్టినోడెవడు? ఇట్లా భూముల్లోకి దాన్ని దించగా... మల్లా దానికో కరంటు మోటరు... కరంటు బిల్లు... అంతా చికాకు... ఒకటే దిగులు... ఎదురుగా మాడు మొకాలేసుకుని పత్తి చెట్లు - రేపోమాపో సావడానికి తయారైన ఆస్పత్రిలోని రోగిలాగ వున్నె - ఈసారికి కూడా పండకపోతే... వామ్మో బతికేదెట్ల... అప్పులెట్ల... వడ్డీలు... ఇప్పటికే రెండెకరాల చెలకచెక్క అమ్మి పూటపూటకు గండంగా గడుపుకొస్తున్నంగద...ఈసారికి పంటపండకపోతే తమపని ఖాళీ... దేవుడా.. చివరికి యగసాయం చేసుకుని కష్టం పడి బతికే దానిక్కూడ దిక్కులేకుండ చేస్తివి. ఈ బోర్లు పాడుగాను. నాశమైనంగాదు - కమలమ్మ గుండెలో కలుక్కుమంది.

"ఏం సోంచాయిస్తున్నవే..." ఎల్లారెడ్డి భార్య పక్కన కూలబడ్డడు. మనిషి పక్కన కూకుంటే అదో దయిర్యం - తన మొగుడు కూడా అందర్లాంటి మనిషే - పాపం... ఎంతకని గీ సంసారాన్ని ఈదుకొస్తడు - తాను మాత్రం చేసేదేముంది గనక... వూరువూరంతా



ఇంతే సంగతులాయె - తమేమైన ఘనపొడిచి వచ్చిన వాళ్ళమా?

"ఏం లేదు - గీ బోర్లనన్న నీళ్ళుగాని పడితె బతుకుతం!" కమలమ్మ నిర్లిప్తంగా అని రెండు చేతులెత్తి ఆకాశంలో కనిపించని దేవుండ్లకు మొక్కుకుంది.

"నూటాభైదనక దిగింది పటేల్‌సాబ్... అబ్బా జమీన్... మెత్తగా వుంది..." బోరువాడి మాటల్ని వెర్రిగా వింటూ బోరువేసే పొడుగుపాటి గిరగిరా తిరిగే గొట్టం వంకా... కింద అది భూగర్భంలోకి సొరదీసకపోతుంటే, బయటకొచ్చే మొరం వంక కండ్లింత చేసుకుని ఆబగా చూస్తండు. యాడ్నుంచైన గింత.... గింతంత తడి కనబడితేసాలు... తడి... తడి... ఎల్లారెడ్డికంతా మత్తుగా వుంది. పైన సూర్యుడు నడినెత్తిమీద నిప్పుల శూలాలు గుప్పిస్తున్నాడు.

* * *

"చార్‌సౌఫీట్ తక్ లగాయా... అబ్ ఆయా పత్తర్... ఇస్కా... రాయివచ్చిందీ - ఏం చేస్కోవాలె పటేల్ సాబ్" బోరతని మాటలు విన్న ఎల్లారెడ్డి శివాలు తొక్కాడు. మనిషి మెదడంతా అల్లకల్లోలమై పోయింది. మామూలుగా పేకాట క్లయిమాక్సులో... గుర్రప్పందాల్లో గుర్రాలు ట్రాకు మీద వురుకుతున్నప్పుడు లక్ష పందెం కాసిన వాడిక్కలిగే అలజడి... సంకురాత్రికి కోడిపందాల్లో తన పుంజును పోటీలో వదిలి అది ఎదుటి పుంజుతో కలబడుతుంటే దాని యజమాని గుండె సప్పుడు అప్పుడు ఎల్లారెడ్డిలో కనబడినై! మనిషి దెయ్యం పట్టినట్లు, పూనకం వచ్చినట్లు అరిచిండు.

"కానియ్... ఇంగో... ఇంగో ఇప్పటిదనక నువ్వు దడదడలాడిచ్చినందుకు నీ దబ్బులు. కానియ్యాసె" నడుం పట్టిలో నుంచి నోట్లకట్టతీసి బోరువాని మీదకు విసిరిండు.

"పోనీయ్... వెయ్యడుగుల్దాక పుర్సత్.. పుర్సత్..." దడదడమని బోరుమోత మోగిచ్చుకుంట రాతిపొడిని బయటకు పెద్దఉబ్బలా తీసింది. చిక్కగా పైకిలేచి ఆవిరిచ్చిన రాతిపొడి అరమైలుదాక పాకింది. దగ్గు... ఉక్కిరిబిక్కిరి - ఆ రాతిపొడిలో మనుషులు మసక మసగ్గా కన్పిస్తున్నరు. ఎల్లారెడ్డి వెర్రిగా "వెయ్యడుగులు... హజార్‌మారో" అని అరుస్తూ ధూలా చేస్తుండు... దగ్గరకొచ్చిన కమలమ్మను ఒక్క నెట్టుడు నెట్టేసరికి అంతదూరాన ఎగిరిపడి ముదనష్టపోడు... పాడుగాను" అని తిట్లు తిట్టింది.

"లగాన్.. లగలగాన్... వెయ్యడగులు... ఈ నీళ్ళకునా... నకరాల్...నా చెట్లనెండ పెడ్తావ్... ఎంత కర్సయినా సరే.. నా పంటబతకాలె... నేను సచ్చినా ఫికర్ లేదు.. నా పంట... నాతోట...

ఎల్లారెడ్డి కాస్సేపు మగతలోకి జారిండు.. బోరు శబ్దం ఆగిపోయింది. ఎల్లారెడ్డి కండ్లు తెరిచి చూసిండు.

"అరెనీ... ఏమయింది.. బోరు ఇస్టార్టు చెయ్" గద్దించిండు.

"పైసాసాబ్... మీరిచ్చిన పాతిక వేల దాకా కొట్టినం... నౌసౌ... తొమ్మిది వందలడుగులు... పత్తర్ హీ పత్తర్... ఫాయిదా నహీ... మరో చోట పాయింటు పెట్టాలె పటేల్... ఇంగిది లాభం లేదు.

చుట్టు ఆవిరించిన రాతిపొడి మేఘాల్ని ఎల్లారెడ్డి మిటుక మిటుకూ చూసిండు. దిగ్గున లేచి కమలమ్మ తానకు వచ్చిండు.

"కమలమ్మా - దొరదగ్గరకు పొయ్యి మనిల్లు కుదవకేసి పాతికవేలు దెచ్చిన - నీకు చెప్పలె... ఏడుస్తవని... ఈ రెండెకరాల చెలకకుదవచేసి మరిన్ని పైసలు పట్టకొస్త"

ఎల్లారెడ్డి కొడుకు వీరారెడ్డి నోరువెళ్ళబెట్టిండు.

"అదేంది బాపూ... మన చెలకను కుదవబెట్టి మనమే బోరు దీయిస్తే మనకేంది లాభం ? దొరే దున్నుకుంటడు.." కొడుకు అయోమయంగా అడిగిండు.

"అది కాదురా... కొడుకా... నీటి ఒనరు ఏర్పడినంక మనమే దీన్ని కౌలుకు దీసుకుంటం - ఎట్లనో కూల్నాలిజేసి కుదువకట్టు నుండి ఇడిపిచ్చుకోవచ్చు - గపుడు చెలకా - బోరూ మనవయితయి గద!"

ఈ తిరకాసు అర్థంగాక ముందే వేగంగా

(మిగతా 14వ పేజీలో)

అద్దంలో శత్రువు

పుప్పాల కృష్ణమూర్తి

ఓ ముసలమ్మ పల్లెల్లో అలంకరణ సామాన్లు అమ్ముకుంటుంది. ఆ రోజు అడవి దారిన వెళ్తూ మర్రిచెట్టు కింద ఆగింది. నెత్తి మీది గంపను కిందకు దించి, రొట్టెలు తిని పడుకుంది. ప్రయాణ బడలిక వల్ల వెంటనే నిద్రపట్టింది.

ముసలమ్మ తట్టలో రొట్టెలు తీసి తినడం చూసిన కోతి ఒకటి మెల్లగా చెట్టు దిగింది. ఒక్కో సామాను తీసి కొరకసాగింది. అవి గట్టిగా వుండడంతో కింద పడేయసాగింది. తిలకం సీసాలు, సబ్బులు, సబ్బు పెట్టెలు, దువ్వెనలు, కాటుక్కాయలు ఇలా ఒక్కొక్కటే తీసి కిందేసింది. తర్వాత అద్దాన్ని కొరకబోయి తన ప్రతిబింబాన్ని చూసి ఆగిపోయింది. ఆనందంతో దాన్ని వెనక్కి, ముందుకు వంచుతూ, పళ్లికిలిస్తూ, నెత్తి గోక్కుంటూ, కళ్లు చికిలిస్తూ రకరకాల చేష్టలు చేసింది. తాను ఎలా చేస్తే ప్రతిబింబం అలాగే చేస్తుండడంతో ఆకలి కూడా మర్చిపోయి ఆడుకోసాగింది. ఇంతలో ముసలమ్మ కదలడంతో రెండు అద్దాలు చేత పట్టుకొని పరుగుతీసింది. నిద్రలేచిన ముసలమ్మ చిందరవందరగా పడున్న సామానంతా తట్టలో వేసుకొని గబగబా వెళ్లిపోయింది.

కోతి మరో చెట్టు కింద కూర్చొని అద్దం చూసుకుంటూ పరిసరాలను మర్చిపోయింది. దాని అభినయం చూసి దగ్గరకొచ్చిన తోడేలు "ఏంటది?" అంది. హఠాత్తుగా సేనాధిపతి కన్పించడంతో తత్తరపడి చెట్టు వైపు పరిగెత్తింది కోతి. చెట్టెక్కుతుండంగా చేతిలోని అద్దం జారి కింద పడింది. తోడేలు దాన్నందుకుని చూసింది. అచ్చం తనలాగే వున్న తోడేలు కన్పించింది.

"ఈ కోతి ఎంత టక్కరిది. నాతో స్నేహాం నటిస్తూనే ద్రోహాం చేయాలనుకుంటుందన్న మాట. లేకుంటే నేనుండగా మరో తోడేలును ఎందుకు పట్టుకొచ్చింది? నన్నే పదవిలోంచి తీసివేయిస్తుంది కాబోలు" అనుకొని నక్క మంత్రి వద్దకు వెళ్లింది. కోతి చేసిన ద్రోహం చెప్పి అద్దాన్ని నక్క చేతికి ఇచ్చింది. తన ప్రతిబింబాన్ని చూసుకున్న నక్క, "అమ్మో! నన్ను కూడా మంత్రి పదవి నుండి తప్పించాలనుకుంటోంది. దీన్ని క్షమించకూడదు. వెంటనే వెళ్లి రాజుతో చెబుదాం పద" అని అద్దం పట్టుకొని పరుగుతీశాయి.

గాఢనిద్రలో వున్న రాజును ఉలిక్కిపడేలా పిలిచాయి. తమ గోడు చెప్పుకుని బావురుమన్నాయి. "మమ్మల్ని పదవుల నుంచి తీసెయ్యకండి. మేమెంతో నమ్మకంగా పని చేస్తున్నాం. కలలో కూడా మీకు అపకారం తలపెట్టలేదు..." అని సింహం చేతిలో అద్దం పెట్టాయి.

అద్దంలో సింహం కనిపించేనరికి అది ఉలిక్కిపడింది. "ఆ కోతి అడవికి కొత్త మంత్రి, కొత్త సేనాధిపతినే కాదు. మరో కొత్త సింహా రాజును కూడా తేవాలనుకుంటోంది. దాన్ని వదిలి పెట్టకూడదు. చంపేయాలి" అని గర్జించింది.

సింహం, తోడేలు, నక్క కలిసి కోతి కనిపించిన చెట్టు దగ్గరకు వెళ్లాయి. కోతిని చూసి పళ్లు నూరాయి. "నువ్వు కిందకు దిగరా రాజద్రోహి. నిన్ను ముక్కలు ముక్కలుగా చేయకుంటే మేమెందుకు?" అన్నాయి నిప్పులు కురిపిస్తూ.

తనను చంపడానికి రాజు, మంత్రి, సేనాధిపతి కలిసి రావడంతో భయంతో మరో చెట్టు మీదకి దూకింది కోతి. అప్పుడా చేతిలోని అద్దం కిందపడి అనేక ముక్కలయ్యింది. అవి పరుగున వెళ్లి ఆ ముక్కల్లోకి తొంగి చూశాయి. ప్రతి అద్దం ముక్కలోనూ వాటికి మరో జంతువు కనిపించసాగింది.

"అయ్యు బాబోయ్! ఎన్నేసి జంతువుల్ని పట్టుకొచ్చిందో? దాన్ని మనం చంపినా, ఇవి మనల్ని వదిలిపెట్టవు. కనుక దాన్ని చంపడం కంటే, స్నేహం చేయడమే మంచిది. ఆలోచించండి మహారాజా..." అంది నక్క.

"నిజమే. అది మన కొలువులో వుంటే రాజ్యానికే రక్షణగా వుంటుంది గదా" అంది తోడేలు. సింహం కూడా వాటి ఆలోచనలను మెచ్చుకుంది. వెంటనే జిరాఫీని పిలిచి కోతి దగ్గరకు రాయబారిగా పంపాయి. అది వెళ్లి రాజాస్థానంలో గూఢచారిగా వుండేట్లు కోతిని ఒప్పించింది. దాంతో అన్నిటి భయం తీరిపోయింది.



చిన్నారి చిత్రకారులు

ఎం.సాగర్,
జగ్గన్నపేట,
విశాఖ.



నెక్కల రవిచంద్ర,
8వ తరగతి,
జె.ఎన్.ఎమ్.హెచ్.స్కూల్,
పెద్దాపురం.



బి.అనిత, 7వ తరగతి, ప్రాథమికోన్నత పాఠశాల, బిడేకన్నె, మెదక్.



సిహెచ్. కార్తీక్‌కుమార్, 3వ తరగతి,
సేక్రెడ్ హార్ట్ (ఇఎం) స్కూల్, నల్గొండ.

బి.అశోక్‌కుమార్, 8వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం, తాడేపల్లి.



ఏం కనిపిస్తోంది?

హాయ్ చిన్నారులూ! ఇవాళ మన మ్యాజిక్ మ్యాజిక్‌లో ఇ
బొమ్మ ఎలాగుంది? మీకు అందులో ఏమేం కనిపిస్తున్నాయి?
పరిశీలనగా చూసి చెప్పండి.

'ఆ... ఏమేం వున్నాయంటే... ఆకాశం, బోలెడన్ని చెట్లు,
ఇళ్లు, ఇళ్లల్లోకి వెళ్లడానికి మెట్లు వున్నాయి' అంటున్నారు నేస్తాల
కానీ మీరు గుర్తించలేనివి, చాలా ముఖ్యమైనవి అక్కడ వున్న
ఇప్పటికైనా బాగా పట్టి పట్టి చూసి చెప్పండి.

ఆ.. ఇంకేమీ లెవ్వండీ. ఎంత చూసినా అంతే' అంటు
కొందరు నేస్తాలు. ఇంకొందరేమో బాగా ఆలోచనలో పడిపోయ
పోనీ మేం చెప్పేసెయ్యమా!

పేజీని అటు తిప్పి చూడండి. మనిషి తల కనిపిస్తుంది. అ
మిమ్మల్నే చూస్తున్నట్టుకూడా అనిపిస్తుంది. ఇల్లే ఆయన ముక్కు
వుంది. ఇప్పటికైనా గుర్తుపట్టారా? అంతేకాదు. అక్కడ చాలా మొ
వున్నాయి. అవి మొత్తం ఎన్నో లెక్కబెట్టి చూడండి. ఓకేనా!

చుక్కలు కలుపుదామా!

ఎవరాయన?

నేను చిన్న చిన్న గుహలను తవ్వుతాను. వాటిలో బంగారాన్ని, వెండిని దాచిపెడతాను. అంతేకాదు. నేను వెండి బ్రిడ్జీలను కూడా కడతాను. వెండి, బంగారపు కిరీటాలను తయారుచేస్తాను. కానీ అవి చాలా చిన్నవి. కొన్ని ముందుగానో, ఆలస్యంగానో అందరూ నా సహాయం కోరతారు. కానీ చాలా మంది నా సహాయం తీసుకోవడానికి భయపడతారు. నేనెవరిని?



ఎలా చేరాలబ్బా!

చిన్నారావు దగ్గర ఓ నక్క, కోడి, ఒక బస్తా ధాన్యం న్నాయి. ఓ రోజు వీటన్నిటినీ తీసుకుని నది దాటాల్సి చ్చింది.కానీ తనతో పాటు నక్కనో, కోడినో, ధాన్యపు బస్తానో సుకెళ్లగలడు. అన్నిటినీ ఒక్కసారే తీసుకెళ్లే వీలులేదు. పోనీ కోడినీ, నక్కనూ ఇవతల ఒడ్డున వదిలి ధాన్యపు బస్తాని సుకెళితే నక్క కోడిని తినేస్తుంది. అలాగని నక్కను తీసుకెళ్లి కోడిని, ధాన్యపు బస్తాను వదిలిపెడితే కోడి ధాన్యాన్ని తినేస్తుంది. మరి వాటన్నిటినీ నది ఎలా దాటించాడు?

తెలివైన తమాషా

మీరూ బొమ్మలు వేస్తారా!

నేస్తాలూ! మీరు కూడా ఎంతో చక్కటి బొమ్మలు స్తారుకదా. వాటిని ఎంచక్కా మాకు పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా: **బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్‌నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.**

విష్ణుశర్మ చెప్పిన కథలు విని రాకుమారులు ఆనందించారు. మరొక కథ చెప్పమని కోరారు. ఆ మాటలకు విష్ణుశర్మ ఎంతో సంతోషించాడు. "రాకుమారులారా! ఇప్పుడు నేను చెప్పబోయే కథ యుద్ధానికి సంబంధించినది. యుద్ధం వల్ల కలిగే కష్టనష్టాలు ఇన్నీ అన్నీ కావు. యుద్ధాలు లేకుండా శాంతి వర్ధిల్లితేనే సుఖశాంతులు వుంటాయి. పూర్వం సమాన బలాబలాలు గల ఓ నెమలి, ఒక హంస యుద్ధం చేశాయి. ఒక కాకిని నమ్మడం వల్ల ఆ యుద్ధంలో హంస ఓడిపోయింది. ఇరుపక్షాలు బాగా నష్టపోయాయి. ఇదే 'విగ్రహం' అనే కథ. విపులంగా చెప్తాను వినండి" అంటూ విష్ణుశర్మ చెప్పడం ప్రారంభించాడు.

పూర్వం కర్పూర ద్వీపం అనే అందాల దీవి వుండేది. అందులో కలువ పువ్వులు, తామరాకులతో రమణీయంగా వుండే పద్మకేళి సరస్సు వుంది. అక్కడి పక్షులకు రాజైన హిరణ్యగర్భుడనే హంస అందులోనే నివసిస్తున్నాడు. ఆయన బలపరాక్రమశాలి. బుద్ధిమంతుడు.

ఒకరోజు హిరణ్యగర్భుడు తన మిత్రులతో ముచ్చటిస్తున్నాడు. ఆ సమయంలో ఒక సేవకుడు వచ్చి, "ప్రభూ! దీర్ఘముఖుడు అనేక దేశాలు పర్యటించి తిరిగి వచ్చాడు. మీ దర్శనం కోసం వేచి వున్నాడు" అని చెప్పాడు. "వెంటనే పంపు" అన్నాడు రాజు. ఆ సేవకుడు దీర్ఘముఖుడనే కొంగను తీసుకువచ్చాడు. అతన్ని సాదరంగా ఆహ్వానించాడు హంసరాజు. అతను చూసిన వింతలు, విశేషాల గురించి అడిగాడు.

ఎవరు గొప్ప?



"మహాప్రభూ! మీకొక ముఖ్య విషయం చెప్తాను. నేను వచ్చే దారిలో ఒక గొడవ జరిగింది. అందులో నా పొరపాటూ వుంది. ఆ కారణంగా మీరు కూడా అనేక దూషణలకు గురికావాల్సి వచ్చింది. జరిగినదంతా విని నా తప్పును మన్నించండి'' అని దీర్ఘముఖుడు ఏదో చెబుతుండగా హంసరాజు వారించాడు. "దీర్ఘముఖా! అనలు ఆ గొడవకి కారణమేంటి?" అని అడిగాడు. "మహారాజా! జంబూద్వీపంలోని వింధ్య పర్వతం పైన నివసించే ఆ పక్షులకు రాజు నెమలి. ఆయన పేరు చిత్రపర్ణుడు. ఆ పర్వత మార్గాన పోతున్న నన్ను కొన్ని పక్షులు ఆపి, తమ అతిథిగా వుండమని బతిమాలాయి. వాటి అభ్యర్థనను కాదనలేక ఆ రాత్రి నేను అక్కడే వున్నాను. ఆ పక్షులు నేను చూసిన విశేషాల గురించి చెప్పమని మరునాటి ఉదయం అడిగాయి. నేను కొన్ని చెప్పాను. ఆ తర్వాత నా జన్మస్థలాన్ని గురించి, దానిని పాలిస్తున్న రాజు గురించి అడిగాయి. నేను మన కర్పూర ద్వీపం అందచందాలు, తమ బలపరాక్రమాల గురించి, పాండిత్యం గురించి వర్ణించాను. ఆ తర్వాత "మన రెండు రాజ్యాలలో ఏది అందమైనది? మన రాజులలో ఎవరు గొప్పవారు?" అని అడిగాయి.

"పక్షులారా! ఒక ప్రాంతానికీ, మరో ప్రాంతానికీ భేదం వుండడం సహజం. అందువల్ల పోలిక తేవటం తగదు. దేని ప్రత్యేకతలు దానివి" అని చెప్పాను నేను. అయినా పక్షులు ఊరుకోలేదు. ఉన్నది వున్నట్లు చెప్పాల్సిందేనని పట్టుబట్టాయి. అప్పుడు నేను "అయితే చెప్తాను వినండి. మీ అడవికీ, మా దీవికీ – దోమకీ, ఏనుగుకీ వున్నంత భేదం వుంది. మేం నివసించేది కలువలు, తామరాకులతో నిండిన అందాల సరస్సు. మీరు నివసించేది బండరాళ్ల మీద. రాజుల విషయంలో పర్వతానికీ, ఇసుక రేణువుకీ వున్నంత తేడా వుంది. మీ రాజు ఇసుక రేణువు వంటివాడు. మా రాజు పర్వతం వంటివాడు. మీ రాజు మీకు కాయలూ, కంద గడ్డలూ ఇస్తే మా రాజు మాకు కమ్మని మధురసాలు, పాలు, పూలతేనెలు ఇస్తాడు. మీరు నెమలిరాజును సేవిస్తూ కాయ కసరులు తింటూ కటికరాళ్ల మీద తిరుగుతూ బతకడమెందుకు? నాతోపాటు మా రాజ్యానికి రండి. మా రాజు మిమ్మల్ని తన వారిగా ఆదరిస్తాడు. మాతోపాటు మీరూ పాలు, తేనెలు ఆరగిస్తూ హాయిగా పూల పాన్పులపై పవళించవచ్చు" అన్నాను. నా మాటలు విన్న పక్షులకు ఎక్కడలేని కోపం వచ్చింది. కోపంతో అవి కళ్లెర్ర చేశాయి. నానా తిట్లు తిట్టాయి. 'మీ హంసరాజు వట్టి పిరికిపంద' అంటూ కొన్ని పక్షులు నోరు పారేసుకున్నాయి. అప్పుడు నేను వాటితో ఇలా అన్నాను.

"కుక్కలు మొరిగినంత మాత్రాన ఏనుగులకు గౌరవం తగ్గుతుందా? రోగులకు వైద్యుడు చెప్పిన వైద్యం చేదుగానే వుంటుంది. అలాగే నేను చెప్పిన హితవు మీకు కూడా నచ్చలేదు. బుద్ధిహీనులకు హితవు చెప్తే వాళ్లకి పొగరు తలకి ఎక్కుతుంది. అలా చెప్పబోయిన వారు... పూర్వం కొండముచ్చులకు హితవు చెప్పబోయి ముప్పు తెచ్చుకున్న కుందేలులాగా అవుతారు" అన్నాను. "ఆ కథ ఏమిటి?" అని ఆ పక్షులు అడిగాయి. ఆ కథ చెప్పాను.

వ్యక్తిత్వ కోచ్

పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

ఆర్ట్స్ కాలేజి గేలరీ విద్యార్థులతో నిండిపోయింది.

టీనేజ్‌లో ఉన్న విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. వరుస బెంచీల్లో ఆశీనులయ్యారు.

న్యూఢిల్లీ వాతావరణం ప్రశాంతంగా ఉంది.

ఉదయం పది గంటలు కావడానికి పది నిమిషాలు టైము ఉంది. ఏ కార్యక్రమానికి అయినా అలవాటు ప్రకారం ఆలస్యంగా వచ్చే విద్యార్థులు ఈ సమావేశానికి కాస్త ముందుగా వచ్చారు.

వందమంది విద్యార్థినీ విద్యార్థులైనా హాజరవుతారని కాలేజీ నిర్వాహకులు భావించారు. కానీ రెట్టింపు మంది విచ్చేశారు. ఒకరికోసం ఒకరు అన్నట్లుగా కొంతమంది జట్లు జట్లుగా సమావేశానికి వచ్చారు.

'వ్యక్తిత్వ వికాశం' గూర్చి క్లాసు ఉందని కాలేజీలో నోటీసు బోర్డులో చూసి కొంతమంది రాగా... ఆసక్తి ఉన్నవారు ఆర్ట్సు కాలేజీ గేలరీకి ఉదయం 10 గంటలలోపు రండి అని లెక్చరర్ల ఆహ్వానం మేరకు మరికొంతమంది వచ్చారు.

విద్యార్థుల హాజరు చూసి ప్రిన్సిపాల్ సంతృప్తి చెందారు. తర్వాత మైక్ వద్దకి వచ్చి - 'కొద్దినిమిషాల్లో వ్యక్తిత్వ వికాసం గూర్చి ఖేరా ప్రసంగం ఉంటుంది. ఆత్మన్యూనతతో బాధపడేవారికి ఈ ఉపన్యాసం టానిక్ మాదిరిగా పని చేస్తుంది. మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవడానికి, సమాజంలో వ్యక్తిత్వం కలిగిన మనుషుల్లా నిలబడేందుకు తోడ్పడుతుంది-" అంటూ చిన్నపాటి ఉపన్యాసం ఇచ్చారు.

ప్రిన్సిపాల్ ధర్మతేజపై గౌరవం విద్యార్థుల్లో ఎక్కువగా ఉంది. ఉత్సాహంగా చప్పట్లు కొట్టారు.

ఆ తర్వాత స్టేజిపైకి ఓ యువకుడు వచ్చాడు. సన్నగా పీలగా ఉన్నాడు. ఊదితే ఎగిరిపోయే పుల్లలా ఉన్న అతను తెల్లని షర్టుని టక్ చేసుకున్నాడు. ఫేంటు జారిపోకుండా బెల్టును బిగించాడు.

మైకు అందుకోకముందే విద్యార్థుల్లో నవ్వులు మొదలయ్యాయి. "వీడేమిటి తమకు క్లాసు చెప్పడం ఏమిటని?" చాలా మంది అనుకున్నారు. ప్రిన్సిపాల్ ధర్మతేజ మొగమాటానికి పోయి ఇటువంటి సుత్తి కార్యక్రమాలు ఏర్పాటు చేయిస్తుంటారని మరికొంతమంది తిట్టుకున్నారు.

ఆ యువకుడు మైకు పట్టుకుని రెండు నిమిషాల పాటు ఏమీ మాట్లాడలేదు. కూర్చున్న సమ ఉజ్జీల్లాంటి విద్యార్థులను నవ్వుతూ చూస్తుండిపోయాడు.

విద్యార్థుల్లో గుసగుసలు ఆగలేదు.

"గుడ్‌మార్నింగ్ ఎవ్విరిబడీ!" అతని గొంతులోంచి ఆదేశం లాంటి పలకరింపుతో ఆ ప్రాంగణమంతా నిశ్శబ్దం మేఘంలా పరుచుకుంది. అందరి చూపులూ అతని వైపే...

"మనలాగే ఉన్నాడు.... సన్నగా రివటలా ఉన్నాడు. మనకు ఏం చెబుతాడు... వీడి నుంచి మనం ఏం నేర్చుకుంటాం అని మీరు అనుకుంటున్నారని నాకు తెలుసు. పదవతరగతిలో ఆరు సబ్జెక్టులలో అయిదు సబ్జెక్టులు తప్పి ఎందుకూ పనికిరాడని అందరూ నిర్ధారించి వదిలిపెట్టిన వ్యక్తిని నేను. వందలమంది విద్యార్థుల ముందు ధైర్యంగా నిల్చుని ఇతడు ఏదో చెబుతాడని అందరూ ఎదురు చూసేలా ఆసక్తి కలిగించడం... ఏమి లేని స్థాయి నుంచి మహోన్నతమైన ధైర్యాన్ని పోగుచేసుకుని మీ అందరి ముందూ ధైర్యంగా నిల్చోవడం... అదే వ్యక్తిత్వం అంటే.! మనోవికాసం... మానసిక స్థయిర్యం.. మనో నిబ్బరం... వీటన్నింటికీ ఇదే అర్థం... నా వలే ధైర్యం తెచ్చుకోవాలని, స్టేజి ఫియర్ లేకుండా ఉండాలని ఇవన్నీ చెబుతున్నాను.." ఒక్కొక్క మాట ఆ వ్యక్తి చెబుతుంటే విద్యార్థులంతా చెవులు రిక్కించి విన్నారు.

స్పష్టమైన ఇంగ్లీషు ఉచ్చారణతో... సూటిగా చెబుతున్న ఒక్కొక్క మాట.. విద్యార్థుల హృదయాలకు గుచ్చుకున్నాయి. గేలి చేయాలనుకున్న వ్యక్తి వెనుక ఉన్న స్థయిర్యం వారికి ముచ్చట గొలిపింది.

ప్రశంసల జల్లు కురిసింది.

ఆ తర్వాత రెండు గంటల పాటు ఏకధాటిగా సాగిన అతని ఉపన్యాసం నుంచి ఎవరూ కదల్లేకపోయారు. క్లాసురూములో ఎంతో అనుభవమున్న లెక్చరర్లు కూడా కాలేజి విద్యార్థులను గంటపాటు కూడా కూర్చోబెట్టలేకపోతుంటారు. పట్టుమని పాతికేళ్ళ వయసు కూడా లేని ఈ యువకుడి మాటల్లో ప్రత్యేకత ఏమిటని ప్రిన్సిపాల్ కూడా ఆశ్చర్యపోయారు. నాగస్వరం విన్న పాముల్లా విద్యార్థులు ఖేరా ఉపన్యాసాన్ని వినడం ఆశ్చర్యం కలిగించింది. రిటైర్‌మెంటుకు దగ్గరగా వున్న తను కూడా అదే స్థితిలో వున్నట్లు ధర్మతేజ గ్రహించాడు.

ఉపన్యాసం పూర్తయిన వెంటనే విద్యార్థులు ఆ యువకుడ్ని చుట్టుముట్టారు. ప్రశ్నల వర్షం కురిపించారు. ఆటోగ్రాఫులు కావాలని అభ్యర్థించారు. ఇటువంటి క్లాసులు ఎక్కడ నిర్వహిస్తుంటారో వివరాలు చెప్పమని కోరారు.

అన్నింటికీ అతనిలో చిరునవ్వే సమాధానం.

అతనే అంతర్జాతీయ స్థాయిలో విద్యా మోటివేటర్‌గా, సైకాలజిస్టుగా ప్రసిద్ధి పొందిన శివ్‌ఖేరా... ఎందుకూ పనికిరాడు అనుకుని వదిలిపెట్టిన వ్యక్తి వజ్రంలా ప్రకాశించి అంతర్జాతీయ స్థాయికి ఎదిగాడు. ఏ ఢిల్లీలో అయితే తనను చీదరించుకున్నారో ఆ ఢిల్లీలో మహోన్నత వ్యక్తిగా కీర్తి ప్రతిష్టలను పొందారు.

* * *

శివ్‌ఖేరా న్యూఢిల్లీలో పుట్టి పెరిగాడు.

మధ్యతరగతి కుటుంబంలో చిన్నవాడుగా పుట్టాడు. తల్లిదండ్రులు శివ్‌ఖేరాను ఉన్నత చదువులు చదివించాలని నిర్ణయించారు. బాగా చదువుకోవాలని, మంచి మార్కులు సంపాదించాలని కోరేవారు.

అయితే శివ్‌కు చదువు తలకు ఎక్కేది కాదు.

ఫలితంగా పదవ తరగతి వరకూ ఏదోరకంగా గట్టు ఎక్కి వచ్చి అక్కడ ఉండిపోయాడు.

మొత్తం ఆరు సబ్జెక్టులు పరీక్ష రాశాడు. అయితే మాతృభాష సబ్జెక్టు మాత్రం పాసై మిగిలిన అయిదు సబ్జెక్టుల్లో తప్పాడు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అంతా ఎంతో నిరాశ చెందారు.

తర్వాత దశల వారి పరీక్షలు రాసి గట్టెక్కాడు.

ఇంటర్మీడియెట్ కూడా అత్తెసరు మార్కులతో ఏదో విధంగా పాసయ్యాడు.

డిగ్రీలో మరోసారి గడ్డు పరిస్థితి ఏర్పడింది.

కామర్సు చదివితే బాగుంటుందని బి.కామ్. కోర్సు తీసుకున్నాడు. తోటి విద్యార్థులంతా ఫస్టుమార్కులతో పాసైతే శివఖేరా థర్డుక్లాసుతో సరిపెట్టుకోవలసి వచ్చింది.

మరి చదువు లాభం లేదని ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. గోల్డుమెడలిస్టులు, డిస్టింక్షన్‌లో పాసైన వారు ఎంతో మంది ఉంటుండగా అటువంటి అవకాశం కనిపించలేదు. వ్యాపారంలో దిగాలని అనుకున్నాడు. తోళ్ళపరిశ్రమ, రెడీమేడ్ దుస్తులు, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి వ్యాపారాలను చేపట్టాడు. ఎందులోనూ విజయం వరించలేదు. ప్రతిచోటా నిరాశా, నిస్పృహలే ఎదురయ్యాయి. పెట్టుబడి లేకపోవడం వ్యాపార దక్షత కొరవడడం వల్ల ఏదీ విజయం సాధించలేదు.

ఆ సమయంలో కెనడా వెళ్ళమని ఎవరో సలహా ఇచ్చారు. తాను దాచుకున్న డబ్బులు, స్నేహితులు ఇచ్చిన సొమ్ముతో ఢిల్లీ నుంచి కెనడా వెళ్ళిపోయాడు.

శివ్‌ఖేరా తన ఇరవై నాలుగో ఏట 1975లో కెనడా వెళ్ళడం అతని జీవితంలో కొత్త మార్పుకు శ్రీకారం చుట్టినట్లయింది.

* * *

కెనడాలో శివ్‌ఖేరా మొదట్లో కష్టాలు పడ్డాడు.

వరుసగా ఎదురు దెబ్బలు తిన్నాడు. చాలీ చాలని అపార్టుమెంటులో రెండేళ్ళు వున్నాడు. ఇంటింటికి తిరిగి కార్లను శుభ్రం చేశాడు. ఇన్స్యూరెన్స్ ఏజంటుగా కొన్నాళ్ళు పని చేశాడు. వ్యాక్యూమ్ క్లీనర్లు అమ్మాడు. ఎందులోనూ విజయం సాధించలేదు.

చాలామంది అపజయాలు ఎదురైనప్పుడు నిరాశతో కుంగిపోతుంటారు. తనకు అదృష్టం కలిసి రాలేదని, తలరాత బాగోలేదని నిరాశ చెందుతుంటారు. ఆత్మవిమర్శ చేసుకోవడానికి ఇష్టపడరు. కాని శివ్‌ఖేరా అందుకు భిన్నమైన దృక్పథంతో వ్యవహరించడం వల్ల అతని జీవితంలో కొత్త మార్పులు చోటు చేసుకున్నాయి.

"నేను అపజయాలు పొందినప్పుడల్లా లోకాన్నే నిందించాను తప్ప నాలో లోపాలను గమనించలేదు బైట పరిస్థితులు ఎలా ఉన్నా ముందు నా లోపల పరిస్థితులను మార్చుకోవాలని అర్థమైంది" అని శివ్ తన మిత్రులు కొందరితో చెప్పారు.

వారు చెప్పిన సూచన మేరకు ఆ ప్రాంతంలో ఉంటున్న డాక్టర్ నార్మన్ విన్సెంటు పీలేను కలుసుకున్నాడు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన 'పవర్ ఆఫ్ పాజిటివ్ థింకింగ్' అనే మనస్తత్వ పుస్తకాన్ని ఆయన రాశారు. ముందుగా నమస్కరించి "నేను ఏ పని చేస్తున్నా విజయం లభించడం లేదు" అని చెప్పాడు.

పీలే కొద్దిరోజులు శివఖేర్‌ను పరిశీలించిన తర్వాత 'నీ ఆలోచనా దృక్పథంలో మార్పు రావాలి. జరిగినది మనకు నచ్చకపోయినా ఇష్టం లేకపోయినా నిరాశ చెందుతాం. ఆ పరిస్థితి నుంచి బైటపడాలి' అని సూచించారు.

ఏమీ అర్థం కాలేదు.

ఆ తర్వాత విన్సెంట్ పీలే తాను రాసిన పుస్తకాలను శివ్‌ఖేర్‌కు బహూకరించాడు. మరికొన్ని ముఖ్యమైన పుస్తకాలు వివరాలు, చిరునామాలు చెప్పాడు.

శివ్ మరి వెనక్కి తిరిగి చూడలేదు.

వ్యక్తిత్వ వికాసం కలిగించే ఆ పుస్తకాలను ఒక్కొక్కటిగా చదవడం మొదలు పెట్టారు. ఒకో పుస్తకం చదవడం పూర్తయిన వెంటనే వెయ్యి ఏనుగుల బలం మనసంతా కమ్ముకొనేది. తన మనసును అదుపులో పెట్టుకుంటూ వ్యక్తిత్వాన్ని మరింత అభివృద్ధి చేసుకున్నాడు.

ఆ తర్వాత శివ్‌ఖేరాకు రాయాలని అనిపించింది.

ఎన్నో పుస్తకాలను చదివిన అనుభవం ఎంతో ఉపయోగపడింది. 'యుకెన్‌విన్' అనే పేరుతో పుస్తకాన్ని వెలువరించాడు. మనిషి ఏ విధంగా గెలవాలన్న విషయాలను నిత్య జీవితానికి అన్వయించి రాయడం ఎంతోమందికి విపరీతంగా నచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా అమ్మకాలను ఎక్కువగా పెంచింది. 'యుకెన్‌లీడ్' అనే మరో పుస్తకం కూడా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి గల మార్గాలను తెలియజేసింది. ఈ రెండు పుస్తకాలు ప్రపంచ వ్యాప్తంగా మనస్తత్వ పాఠకుల్ని ఒక కుదుపు కుదిపింది. ఈ పుస్తకాల అమ్మకాలు పెరగడంతో శివ్‌ఖేరా వ్యక్తిత్వమే మారిపోయింది. ఎంతోమందికి మార్గదర్శకులుగా రూపాంతరం చెందాడు.

* * *

న్యూఢిల్లీ

ఓపెన్ యూనివర్సిటీ

ఎంతోమంది ప్రముఖులు కార్యక్రమానికి హాజరయ్యారు.

ఒకప్పుడు సన్నగా, పీలగా ఉంటూ వ్యక్తిత్వ క్లాసులను విద్యార్థులకు నిర్వహించే శివఖేరా కార్యక్రమం భారతదేశ రాజధాని ఢిల్లీలో ఏర్పాటైంది.

కెనడాలో ఉంటున్నప్పుడు ఒకసారి ఢిల్లీ వచ్చిన సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ విద్యార్థుల కోసం ఆయనిచ్చిన ఉపన్యాసం విన్న అప్పటి విద్యార్థుల్లో కొంత మంది ఉద్యోగస్తులై ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

శివ్‌ఖేరా గొప్పతనాన్ని వివరిస్తూ ప్రొఫెసర్ నిరంజన్ ప్రారంభ ఉపన్యాసాన్ని ఇచ్చారు. "మనిషిలో అంతర్గత శక్తులను వెలికితీసే మోటివేటర్‌గా, ఎడ్యుకేటర్‌గా శివ్‌ఖేరా ప్రపంచంలో ప్రసిద్ధి చెందారు."

శ్రోతలు అందరివైపు తిరిగి 'అమెరికాలో ప్రసిద్ధి పొందిన క్వాలిఫైడ్ లెర్నింగ్ సిస్టమ్స్' పేరుతో ఈయన స్థాపించిన సంస్థ ఎంతో ప్రసిద్ధి పొందింది. ఈయన ఉపన్యాసాల కోసం ఎన్నో సంస్థలు ఎదురు చూస్తుంటాయి. జర్మన్ ఎయిర్‌లైన్స్, ప్రపంచ ప్రసిద్ధి పొందిన వివిధ బ్యాంకులు తమ ఉత్పాదకతను పెంపొందించుకోవడానికి ఖేరాను ఆశ్రయిస్తుంటాయి. ఎన్నో పరిశ్రమలు తమ సిబ్బంది కోసం ఈయనతో ఉపన్యాసాలు ఇప్పిస్తుంటాయి. ఇరవై ఏళ్ళ అనుభవంతో మనస్తత్వ విషయాలపై ఉన్న అవగాహనతో ఈయన ఉపన్యాసాలు వినేవారిని ఉత్తేజితుల్ని చేస్తాయి. ఢిల్లీలో ఈయన పర్యటన సందర్భంగా కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది" నిరంజన్ ఉపన్యాసం ముగించారు.

తర్వాత శివ్‌ఖేరా ఉపన్యాసం మొదలైంది.

రెండు గంటల పాటు ఏకధాటిగా జరిగిన కార్యక్రమంలో ఎంతోమంది ప్రముఖులు కూడా అతని ఉపన్యాసానికి మంత్రముగ్ధులు అయిపోయారు.

ఉపన్యాస కార్యక్రమం అనంతరం లంచ్.

ఆ తర్వాత పదిహేనేళ్ళ అమ్మాయి. నిరంజన్ గారి కుమార్తె రూపాదేవి ఖేరా దగ్గరికి వచ్చింది. గులాబి పూలగుత్తిని ఇచ్చి అభినందించింది. ఉపన్యాసం ఎంతో నచ్చిందని మెచ్చుకుంది.

ఆ పాప అభినందన ఖేరా కళ్ళల్లో నీళ్ళు తెప్పించాయి. మనసు విచలితం అయిపోయింది. రెండు నిమిషాల తర్వాత 'బేబీ... చదువుల కన్నా, డిగ్రీల కన్నా వ్యక్తిత్వం, దృక్పథం ముఖ్యం!" అన్నాడు.

"అంటే?" రూపాదేవి ప్రశ్నించింది.

"విజేతల విషయంలో భిన్నత్వం అనేది వారు చేసే పనుల్లో ఉండదు. పనుల్ని చేసే తీరులోనే ఉంటుంది!" అన్నాడు.

"మీరు ఏమైనా చేయగలరు అంకుల్!" అంది.

"లేదు పాపా! నేను కోచ్‌లాంటి వాడిని. ఎవరి ఆట వారే ఆడి గెలవాలి. తెలిసిందా?" అన్నాడు.

"నాలాంటి పిల్లలందరి వ్యక్తిత్వానికి మీరే కోచ్!" ఆమె అభినందించింది.

శివ్‌ఖేరా కళ్ళల్లో మరోసారి నీళ్ళు తిరిగాయి.

(10వ పేజీ తరువాయి)

బోరు

ఎల్లారెడ్డి ఇంటికేసి వురకబోయిండు – "ఇంగో... కలోగంజో తాగుదాం – కూల్నాలి జేసుకుందాం – వీరన్న పట్నంల బోయి కావాల్నంటే రిక్షా తొక్కుతడు. ఒక్కసారి భూదేవిని వదులుకుంటే గదిమల్ల మనకు దక్కదు. నువ్వుగాని గా పని చేస్తే గా చెట్టుకు వురిపెట్టుకుంట" కమలమ్మ గంతకుముందు అంత కఠినంగా పెనిమిటితో ఎన్నడూ మాట్లాడలేదు – మాట్లాడింది – ఎల్లారెడ్డి మొఖం నల్లబడ్డది – తలొంచుకుని తడబడుతూ అడుగులేసిండు – కమలమ్మకు దుఖమాగలేదు.

"అసలెందుకో పానీ రాటం లేదు. మాసేట్ సాబ్ పనే బాగున్నది. ఒక్కటిపోయి దాని మీదనే రెండు కొన్నడు. బోలెడు దబ్బులు – పెట్టుబడెపుడో బూడిపోయింది. ఈ భూమిని నమ్ముకుని లాభంలేదు. దండగ.. గొడ్డులా పన్జేసినా ఫలం లేదు... ప్చ్...!" బోరు ఆపరేటరు మాటలకు కమలమ్మ ఒళ్ళు మండిపోయింది.

"నర్సరె... వేమందరం మా భూములమ్ముకుంటె నీ సేటుగాడు రెండు బోరుబండ్లని పాత ఇనుప దుకాణంల తూకానికి అమ్ముకోవాలె. భూమే లేనపుడింక బోరెవడిక్కావాలె – నేల విడిచి కర్రతిప్పినట్లుంది. అరె వీరన్నా మీ బాపు యాడికి పోయిండో జర కనిపెట్టు పో... పో... భూమిగాని కుదవకేసిండా నా పీనగనే జూస్తరు – " కండ్ల నీళ్ళు కారుతుండగా కమలమ్మ బేలగా అంది – వీరారెడ్డి వూర్లోకి లగామని పరుగు దీసిండు.

* * *

ఎల్లారెడ్డింట్లో బల్లమీద పురుగుల మందు తాగి సచ్చిపడున్నడు. చొంగలు కారి గట్టికట్టినై! గబ్బు మందు వాసన – పక్కనే రెండు పురుగులమందు డబ్బాలు. తాళం తెరిచున్న ట్రంకుపెట్టె – చాలా జాగ్రత్తగా ఈ అవసరం కోసం వారం రోజుల్నాడే వాట్ని తెచ్చి ఎల్లారెడ్డి ట్రంకుపెట్టెలో దాచుంచుకున్నడు.

కమలమ్మ శోకానికి అంతులేదు. భూమిపైన పడి దొర్లుతూ అతి భయంకరంగా ఏడుస్తంది – ఊరిజనమంతా కండ్ల నీళ్ళు కారుస్తూ పోగయిండ్రు.

బయట ఇంకా కొన్ని పొలాల్లో బోరింజన్లు దడదడ చేస్తున్న చప్పుడు వూరంతట్ని భయపెడతనే వుంది! ◆

చి॥సౌ॥ సుబ్బలక్ష్మి.

లక్ష్మి

దెబ్బలు రెండు రకాలు –
ఒకటి – శరీరానికి తగిలే దెబ్బ!
రెండు – మనసుకి తగిలే దెబ్బ!

శరీరానికి తగిలిన దెబ్బ కనిపిస్తుంది. మనసుకి తగిలిన దెబ్బ కనిపించదు. వంటికి తగిలిన దెబ్బకి మందు రాస్తే సర్దుకునే ఛాన్సుంది. మనసుకి తగిలిన దెబ్బకి మందేలేదంటారు!

వేలు చితికినా...

కాలు బెణికినా..

నొప్పిగానే వుంటుంది. ఎంత నొప్పిగా వున్నా భరించవచ్చు. చెంప ఛెళ్ళుమనిపించినప్పుడు.. కడుపులో గుద్దినప్పుడూ కళ్ళనీళ్ళు తిరుగుతాయి! ఇవన్నీ తగిలిన దెబ్బకి సంకేతాలు!

దెబ్బలు శరీరానికి తగిల్తే –

కంటిక్కనిపిస్తాయి!

మనసుకి తగిలే దెబ్బలు కనిపించవు. ఈ దెబ్బలకు రాళ్ళూ రప్పలు వాడక్కర్లేదు. చెయ్యి చేసుకోనక్కర్లేదు!

ఒక మాట చాలు –

మనిషిని కృంగదీస్తుంది!

సుబ్బలక్ష్మి భర్త కదు బుద్ధిమంతుడు. అవలక్షణాలేమీలేని వాడు. కోపతాపాలెరుగని మనిషిగా పదిమందిలో పేరు తెచ్చుకున్నవాడు!

అయితే –

అతను కూడా అప్పుడప్పుడు సుబ్బలక్ష్మిని చితకబాదుతాడనే రహస్యం – సుబ్బలక్ష్మి ఆత్మహత్య తరువాత తెలిసి బంధుగణం ఆశ్చర్యపోయేరు!

చెయ్యాకాలూ వాడకుండానే –

రాయీరప్పా విసరకుండానే –

రంకెలు పెట్టకుండానే –

మాటల్తో చితకబాదడం అతనికే చెల్లు!

సుబ్బలక్ష్మి వలవలా ఏడుస్తున్నప్పుడు – ఎందుకేడుస్తుందో పక్కవాటా వాళ్ళక్కూడా తెలిసేది కాదు. అతడు ఆమెను చితకబాదిన చిహ్నాలు మచ్చుకి ఒక్కటైనా కనిపించేది కాదు!

ఎప్పుడు చూసినా –

అతను గౌతమ బుద్ధుడల్లే ఎంతో ప్రశాంతంగా వుండేవాడే గాని – నరకాసురుడల్లే నిప్పులు కక్కేవాడు కాదు!

అంత బుద్ధిమంతుడు –

సుబ్బలక్ష్మిని ఎందుక్కొడతాడు?

వలవలా ఏడ్చేందుకు ప్రత్యేకించి కొట్టక్కర్లేదని సుబ్బలక్ష్మి ఆత్మహత్య తర్వాత తెలిసింది!

కుళ్ళుమాట చురకత్తిలాగా పని చేస్తుంది!

అతని మాటలే పదునైన కత్తులు!

వీధి మొత్తం గాఢ నిద్రలో మునిగిపోయినప్పుడు – అతను మేలుకునే వాడు. సుబ్బలక్ష్మిని కూడా నిద్రలేపి కూచోమనేవాడు!

కూచోకపోతే

కొంపమునుగుతుందేమోనన్న భయంలో నిద్ర కళ్ళతోనే సుబ్బలక్ష్మి లేచి కూచునేది!

కలకంటున్నావా అని అడిగేవాడు!

లేదులేదని తల అడ్డంగా ఊపేది!

"ఏమోలే! చాలా సేపట్నుంచి నిన్ను నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నా. ఎంతకీ లేవకపోతే బంగారు కల కంటున్నావనుకున్నా!"

"నాకు కలలు రావండీ!"

"అంతేలే! కోరికలు తీరకపోతే – కలల్తో సరిపెట్టుకుంటారు. అని కోరికలూ తీరింతర్వాత ఇంకా కలలెందుకు? అవునా?"

"ఈ విషయం చెప్పడానికేనా పనిగట్టుకుని నిద్రలేపేరు?"

"లేదు. నాకొచ్చిన కల గురించి చెప్పాలనీ..."

"ఇప్పుడెందుకులేండి?"

"ఇప్పుడే చెప్పాలి. లేకపోతే మరిచిపోతా!"

"నిద్రముంచుకొస్తుందండీ?"

"అంతేలే! ముచ్చట్లన్నా ముగించుకున్న వాళ్ళకి నిద్రే ముంచుకొస్తుంది! కలలెందుకు వస్తాయి? ఇతరుల కలలెందుకు పట్టించుకుంటారు? నిద్రపో!"

"వద్దులేండి. మీకొచ్చిన కల గురించి చెప్పండి. వింటాను."

"అనగనగా ఒక అబ్బాయి.."

"కలన్నారు. కథ చెబుతున్నారే?"

"అంతే! నాకొచ్చే కలలన్నీ కథల్లాగానే వుంటాయి!"

"ఊ... చెప్పండి!"

"అందమైన అబ్బాయి. నాకంటే అందంగా వుంటాడు. అతను వాళ్ళ క్లాసుమేటుని ప్రేమించేడు. ఒకనాడు ఆ అమ్మాయిని తీసుకొని మంగినిపూడి బీచ్‌కి వెళ్లేడు..."

"ఏమండీ..."

"చెప్పనివ్వు!"

"ఇదివరకు ఎన్నో తడవలు చెప్పేరు!"

"ఏం చేయను! ఎప్పుడు నిద్దరోతున్నా నాకు ఈ కలే వస్తుంది! బహుశా ఇది నాపాలిట శాపం ఏమో. జీవితాంతం ఈ కలే నన్ను వేధిస్తుందేమో? ఎంచక్కా రైలూ విమానం కలలు రావచ్చుగా? కనీసం జట్కా బండి కలైనా రావచ్చుగా? ఎప్పుడూ ఒకే కల! దిక్కుమాలిన కల! అందమైన అబ్బాయి, పక్కింటి అమ్మాయి. మంగినిపూడి బీచ్. ఈ మాయదారి కలకి ఎప్పుడు తెరపడుతుందో?"

ఈ దిక్కుమాలిన కథకి –

తెరపడటాలుండవని సుబ్బలక్ష్మికి తెలిసిపోయింది!

పెళ్ళయిన కొత్త రోజుల్లో అతనే ఆమెను అడిగేడు – పెళ్ళికాకముందు నువ్వు ఎవర్నయినా ప్రేమించావా సుబ్బు అని!

పెళ్ళికాకమునుపు ప్రేమించడం, ప్రేమించబడటం నేరం కాదనే ధైర్యంతో సుబ్బలక్ష్మి నిజమే చెప్పింది. చలపతిరావనే తన క్లాసుమేటు తనని గాఢంగా ప్రేమించేవాడని!

అదుగో అప్పట్నుంచీ సుబ్బలక్ష్మి బతుకు అధ్వానమై పోయింది. అప్పట్నుంచీ ఈ దరిద్ర గొట్టు కల అతన్ని విడిచిపెట్టడం లేదు!

ఆ కల అతడ్ని అనాగరికుడ్ని చేసింది!

అనుక్షణం ఆమెను అశాంతి పాలు చేస్తోంది!

ఇది పదిమందికీ చెప్పుకునే 'హింస' కానేకాదు. తాను ఎంచుకున్న పరిష్కారమార్గం పరమ తప్పని తెలిసినా – తప్పనిసరి పరిస్థితి నెత్తినెక్కి కూచోడం వల్ల తన బతుక్కి చుక్క పెట్టేసుకుంది చి॥సౌ॥ సుబ్బలక్ష్మి.

◆

తెలుపంటే మోజెందుకు!

డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి

"ఏవర్ని చూసినా ఇదో పిచ్చి పట్టుకుంది. అమ్మాయి ఎర్రగా బుర్రగా వుండాలని!–" చాలా ఆవేశంగా అంటూ లోపలికి వచ్చింది లలిత.

"ఏమైందే అంత ఆవేశం" అడిగాన్నేను చల్లగా. నేను ఆవేశపడకుండా.

"అదేనే – మా బాబాయి కొడుక్కు పిల్లను చూడాలని వెళ్తున్నామని చెప్పా గదా దాని సంగతి..." అంది లలిత.

"ఇప్పుడు ఏమైంది. పిల్లను చూడలేదా?"

"చూశాం కాని పిల్ల కాస్త చామనచాయలో వుంది అంటే వాడేమో అది చామనచాయ కాదు నలుపు, కారు నలుపు అంటాడు. వాడి అమ్మ ఏమో పిల్ల చామనచాయలో వుంది. ఈ కాలంలో ఎన్నో క్రీమ్‌లు వచ్చాయి కద అవి వాడితే పిల్ల తెల్లలోకే లెక్క అంటున్నది..."

లలిత మాటలు విని నాకు నవ్వు వచ్చింది.

"అదేదో ప్రకటనలో అదే చూపారే. పెండ్లిపిల్ల కాస్త చాయ తక్కువగా వుంటుంది. ఇక అనాది కాలం నుంచి వస్తున్న మూలికలతో చేసిన క్రీమ్‌ను వాడి తెల్లగా అవుతుంది. తెల్లబడగానే ఆ అమ్మాయికి ఎక్కడ లేని అత్మవిశ్వాసం వచ్చినట్లుగా చూపటం మన ప్రకటనలు తయారు చేసేవాళ్ళ వింత కల్పనల కలకో నిదర్శనం అనుకో!" అన్నాన్నేను చిరునవ్వుతో.

"అయినా నలుపురంగు చివరకు చామనచాయ కూడా ఎవరికీ ఇష్టం కావటం లేదు. అసలే నచ్చటం లేదు. మగపిల్లల విషయంలో అంత పట్టింపు లేదుగాని ఆడపిల్లలు మాత్రం తెల్లగా వుండాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. అంతెందుకు మన దేశ జనాభాలో తొంభైశాతం వరకూ చామనచాయ, నలుపురంగుల్లోనే వుంటారు కదా... అవునా కాదా సుశ్మీ! చెప్పు!" అడిగింది లలిత.

"అవును మరి! ఇంగ్లీషు వాళ్ళు మనల్ని తెల్లవాళ్ళ కింద లెక్కవేయలేదు కద. బ్రౌన్ అనే అన్నారు మనల్ని. అంటే చామనచాయలో, నలుపులో వుంటామనే లెక్క" అన్నాన్నేను.

"మరి అటువంటప్పుడు ఈ తెలుపు మీద, ఎర్రగా బుర్రగా వుండాలని రంగుమీద ఎందుకీ మోజు. చామనచాయలో వుండేవాళ్ళు అందంగా వుండరా ఏమిటి? అందం అనేది చర్మం రంగులో అదీ తెల్లగా వుంటేనే వుందా చెప్పు సుశ్మీ!" లలితలో ఇంకా ఆవేశం తగ్గలేదు.

"అందమనేది రంగులో వుండదు నిజమే కానీ... ఎందుకో ప్రపంచమంతా తెల్లరంగు అంటేనే మోజు చూపుతారు. ఇప్పుడు చూడు మన సినిమాల్లో ఎక్కడైనా నలుపో చామనచాయ రంగులోనో వున్న నాయిక గాని నాయకుడు గాని కన్పిస్తారా చెప్పు! అంతెందుకు సినిమా మొత్తంలో అందరూ తెల్లగా వుండేవాళ్ళే కన్పిస్తారు. డార్క్ చర్మంతో వున్న ఒక మనిషీ కన్పించదు. ఇదంతా వాస్తవానికి దూరమేగా లల్లీ!" అన్నాన్నేను.

"మరి హీరోయిన్లను ఎర్రగా బుర్రగా వున్న వాళ్ళనే చూపుతారు. ఈ మధ్య ఒక ఫెయిర్ క్రీమ్ ప్రకటనలో ఒక అమ్మాయి ఆ క్రీమ్ వాడి బాగా తెల్లబడితే సినిమా నిర్మాత రాకేశ్ రోషన్ ఆ అమ్మాయిని చూసి నా తర్వాత సినిమాలో నువ్వే హీరోయిన్‌వి అని అంటాడు. అట్లానే మరో ప్రకటనలో ఫెయిర్ క్రీమ్ వాడి ఒకమ్మాయి తెల్లబడుతుంది. ఎయిర్ హోస్టెస్‌గా సెలెక్ట్ అవుతుంది. దాంతో కొడుకులు లేరే అని విచారించే తండ్రి మనస్సు తేలికపడుతుంది. ఇట్లా తెల్లపరిచే క్రీమ్‌లను, జెల్‌లను అమ్ముకోవటానికి వాటిని తయారు చేసే కంపెనీలు మనమీద గుప్పించే వ్యాపార ప్రకటనలు మన మనస్సుల్ని చెరిచేస్తున్నాయేమోననిపిస్తుందే నాకు సుశ్మీ! లేకపోతే ఏమిటీ లేనిపోని మోజు తెలుపు చర్మం మీద! నలుపులో వున్న అందాన్ని ఎవరూ గుర్తించటం లేదు, అంది లలిత ఇంకా ఆవేశం విడువకుండా.

"నిజమేనే లల్లీ! ప్రతి దాన్ని ఆడపిల్లలు ఉద్యోగం మొదలుకొని వరుని వరకు అన్నీ తెల్లచర్మంతో సాధించవచ్చునని చూపటం" విచిత్రంగానే వుందే! తాము తయారు చేసే క్రీమ్‌లు అమ్ముడుపోవటానికి వాళ్ళు చిత్రవిచిత్రమైన కల్పనలతో వ్యాపార ప్రకటనలను గుప్పిస్తున్నారు. ఆడపిల్లలు ఎగబడి ఆ క్రీమ్‌లను కొంటున్నారు. క్రీమ్‌లను తయారు చేసే వాళ్ళకు వ్యాపారం కావాలి. ఇటువంటి వెర్రిమొర్రి ప్రకటనలతో వాళ్ళ వ్యాపారం జోరుగా సాగుతూ వుంది. అందుకే గద ఇప్పుడు రకరకాలైన ఫెయిర్ క్రీమ్‌లు పెద్ద సంఖ్యలో తయారై మార్కెట్‌లోకి విడుదలవుతున్నాయి, సొమ్ము చేసుకుంటున్నాయి. తెల్లచర్మం గురించి మనలో మోజు పోనంత వరకు వాళ్ళ వ్యాపారం సాగుతూనే వుంటుంది" అన్నాన్నేను గంభీరంగా. "అంటే సుశ్మీ! ఇటువంటి అబద్ధాల ప్రకటనల మీద ఏ ఆంక్షలు లేవంటావా? అంటే సెన్సార్ బోర్డు వంటిది ఏమీ వుండదంటావా?" అమాయకంగా అడిగింది లలిత.

'ఏ సెన్సార్ బోర్డు పని చేస్తుంది వీటి మీద. అంతెందుకు పచ్చరంగులో వుండే జపాన్, చైనా, కొరియా వంటి దేశాల్లో కూడా తెల్లపరిచే క్రీమ్‌ల మీద ఆడపిల్లలు చాలా ఖర్చు చేస్తారట! ఇక చామనచాయ, నలుపులో వుండే మన ఆడపిల్లలు వాటిమీద మోజు చూపుతున్నారంటే ఆశ్చర్యపడనే అక్కరలేదు. ఇది ప్రపంచమంతా వున్న మోజు! ఇప్పుడు తెల్లవాళ్ళల్లో కూడా నల్లవెంట్రుకల వాళ్ళ కంటే రాగి వెంట్రుకలు, వెండి వన్నెలో తళతళ మెరిసే వెంట్రుకలంటే మోజు ఎక్కువట! వాళ్ళను 'బ్లాండ్' అంటారు. 'బ్లాండ్' అంటే వాళ్ళకు ఎక్కువ ఇష్టమట! ఏం చేస్తాం. తెల్లరంగు మీద మోజు అది!" అన్నాన్నేను.

"అందుకేనేమో పాప్‌సింగర్ మైకేల్ జాక్సన్ ఆపరేషన్ చేయించుకొని చర్మం రంగే తెల్లగా మార్చుకున్నాడు. ఏం పిచ్చో అది. రానురాను ఇటువంటి ఆపరేషన్లు మామూలవుతాయంటావా సుశ్మీ!" అంది లలిత చిరునవ్వుతో. "ఏమో! సైన్స్ పరిశోధనలు దాన్నీ సాధ్యం చేస్తాయేమో!" నవ్వాన్నేను. ◆

సత్యం వారం రోజులుగా పంటి నొప్పితో బాధపడుతున్నారు. పంటినొప్పి ఒకటి కాదు, దవడ వాపు, విపరీతమైన భరించలేని నొప్పి, ఆహారం తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అతను సంవత్సరాల తరబడి పిప్పిపన్ను వ్యాధితో బాధపడుతున్నాడు గాని, దానికి తగిన వైద్యం చేయించుకోలేకపోయాడు. నొప్పి అనిపించినప్పుడల్లా మెడికల్‌షాపు వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ్డం, నొప్పికాస్త తగ్గగానే దాన్ని పట్టించుకోకపోవడం ఇలా సంవత్సరాలే గడిపేశాడు సత్యం. అతను పంటినొప్పిని అశ్రద్ధ చేయడానికి మొండివైఖరి కొంత కారణమైతే, డాక్టర్లు తీసుకునే ఫీజు విషయం తలచుకున్నప్పుడల్లా పాపం ముచ్చెమటలు పోసి అశ్రద్ధ చేశాడు. ప్రస్తుతం సత్యం పంటినొప్పి స్వంత వైద్యాలకు, చిట్కా వైద్యాలకు లొంగేలా లేదు. ఆ రకంగా రకరకాల ప్రయోగాలు చేసి, చివరికి దంతవైద్యుని సంప్రదించక తప్పలేదు.

డా॥ కె.ఎల్.వి.ప్రసాద్

పంటికుదురు వ్యాధిగ్రస్తమైతే...!!

నాలుగు రోజుల పాటు వ్యాధి నిరోధక మందులు, బాధ నివారణ మందులు వాడి, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే పరీక్షలు చేయించుకున్న తరువాత, పన్ను తీయడానికి ముహూర్తం పెట్టారు డాక్టరు గారు. పన్ను తీసిన తరువాత ఆ నొప్పి పీడ కాస్తా వదలిపోతుందని తెగ సంబర పడ్డాడు సత్యం. ఆ పని కాస్తా అయిపోయిన తరువాత, ఇంక మందులతో అంత పని ఉండదనుకున్నాడు సత్యం. అందుచేత డాక్టర్ రాసిన మందులు సగం మాత్రమే కొనుక్కుని వాడాడు. పైగా రోజూ తన చేతి వేలును



పన్ను తీసిన పంటి కుదురులో పెట్టి చూడడం వంటి పనులు చేయడం మొదలు పెట్టాడు. దానితో సమస్యకు మరో సమస్య తోడై, నొప్పి తగ్గకపోగా మరింత తీవ్రతరమైంది. నాలుగు రోజుల తర్వాత మరింత వాచిన దవడతో, నొప్పితో, నీరసంతో మళ్ళీ మరోసారి దంత వైద్యుని సంప్రదించక తప్పలేదతనికి ఇలా సత్యం లాంటి వాళ్ళు మన సమాజంలో చాలా మంది ఉంటారు. నిరక్షరాస్యత, నిర్లక్ష్యం, పేదరికం ఇవన్నీ తోడై, ఇబ్బందుల పర్వం మరింత వికృతరూపం దాలుస్తుంది.

ఇంతకి పన్ను తీసినా, అతని పంటి నొప్పి తగ్గకపోవడానికి అసలు కారణం, పన్ను తీసిన చోట అంతా పంటి కుదురు వ్యాధిగ్రస్తం కావడమే.

పన్ను తీసిన తరువాత పంటి కుదురు వ్యాధిగ్రస్తం కావడాన్ని 'డ్రై-సాకెట్' అంటారు.

కారణాలు :

పన్ను తీయించుకున్న వారందరికీ ఈ సమస్య ఎదురు కాదు. కొద్ది శాతం మందిలో ఈ సమస్య ఉత్పన్నం అవుతుంది. దానికి కారణాలు తెలుసుకుందాం

➲ పన్ను తీయించుకునే ముందు, పన్ను తీయించుకున్న తరువాత వైద్యుల సలహాలను పాటించకపోవడం. తగిన రీతిలో మందులు



వాడకపోవడం.

- మధుమేహం వంటి వ్యాధుల గురించి వైద్యుల దృష్టికి తీసుకొని రాకపోవడం. తద్వారా మూత్ర పరీక్షలు చేయించుకొనకపోవడం.
- రక్త సబంధమైన వ్యాధుల గురించి దంత వైద్యుల దృష్టికి తీసుకురాకపోవడం, తద్వారా అవసరమైన రక్త పరీక్షలు చేయించుకోకపోవడం.
- దంతవైద్యుల సలహా మేరకు ఎక్స్-రే వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోకపోవడం.
- దంత వైద్యుల సలహాలకు భిన్నంగా, పన్ను తీయించుకున్న వెంటనే నోరు పుక్కిలించడం, ఘన ఆహార పదార్థాలు తీసుకోవడం.
- పరిశుభ్రత పాటించకుండా, పంటి కుదురులో పదే పదే చేతి వేళ్ళు పెట్టి చూడడం, నాలుకతో అదే పనిగా తడమడం.

లక్షణాలు :

వ్యాధి నిర్ధారణ ఫలితంగా నొప్పి పుడుతున్న పన్నును తీసివేసిన తరువాత, వైద్యుల సలహా మేరకు మందులు వాడితే, సహజంగానే నొప్పి తగ్గిపోయి పంటి కుదురు మూసుకుపోతుంది.

కాని ఎలాంటి లోపం కలిగినా పంటి కుదురు వ్యాధిగ్రస్తమై, గతం కంటే అధికంగా నొప్పి వస్తుంది. ఈ పరిస్థితిని గుర్తించడానికి కనిపించే లక్షణాలను గురించి తెలుసుకుందాం.



డ్రై సాకెట్ వ్యాధి లక్షణాలు :

- పన్ను తీసిన రెండు లేదా నాలుగు రోజుల తర్వాత నొప్పి మరింతగా ఉధృతమవుతుంది.
- నోటి నుండి దుర్వాసన మొదలవుతుంది.
- నోటి రుచిలో మార్పు వస్తుంది. అది కూడా భరించలేనిదిగా ఉంటుంది.
- పంటి కుదురులో రక్తం గడ్డకట్టకుండా, పంటి కుదురు ఖాళీగా ఉండి, ఇతర పదార్థాలతో నిండి ఉంటుంది. ముట్టుకుంటే భరించలేని నొప్పి కలిగిస్తుంది. పంటి కుదురు వ్యాధిగ్రస్తం కావడమే దీనికి కారణం.
- జ్వరం రావడం, నీరసం కలిగించడం, ఆహారం-మంచినీళ్ళు కూడా తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది.
- ఆ ప్రాంతంలోని దవడ - దీనికి అనుబంధమైన లింఫ్ గ్రంథులు వాచి ముట్టుకుంటే నొప్పిని కలిగిస్తాయి.

నిర్లక్ష్యం చేస్తే :

డ్రై-సాకెట్ వంటి పంటి కుదురు వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ఉధృతమై, అక్కడ కురుపు ఏర్పడి చీమును కలిగించవచ్చు. కారణంగా పంటి దవడ కూడా వ్యాధిగ్రస్తమై 'ఆస్టియోమెలయిటీస్' వంటి వ్యాధికూడా ప్రారంభమై మరిన్ని చికాకులు కలిగించవచ్చు. ముందుగానే జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కావు మరి! ◆

మరి ఏం చేయాలి ?

పైన వివరించిన లక్షణాలు కన్పించినప్పుడు తక్షణమే దంత వైద్యులను సంప్రదించాలి. సాధ్యమైనంత వరకు గతంలో పన్ను తీసిన దంతవైద్యునే సంప్రదించడం మంచిది. ఆ వ్యాధి పూర్తి వివరాలు ఆ వైద్యునికే పూర్తిగా తెలిసి ఉంటాయి కనుక వారికి చూపించడమే మంచిది.

'డ్రై-సాకెట్' వంటి సమస్య ఉత్పన్నమైనప్పుడు దవడలో, పంటిముక్కల కోసం దంతవైద్యుల సలహా మీద ఎక్స్-రే పరీక్షలు చేయించుకోవడం మంచిది.

మధుమేహం, హిమోఫీలియా, ఎనీమియా వంటి వ్యాధుల నిర్ధారణ కోసం, తప్పనిసరిగా మూత్ర పరీక్ష, రక్త పరీక్ష చేయించుకోవడం మంచిది. ఈ వ్యాధులు ఉంటే ఇతర వైద్యం కూడా చేస్తే తప్ప, అసలు సమస్య నయం కాదు. వైద్యులు రాసిన మందులు తప్పకుండా క్రమం తప్పకుండా వాడడం ఆరోగ్యకరం.

గోరువెచ్చని నార్మల్ సిలైన్‌తో గాని, ఉప్పు నీటితో గాని, 'క్లోర్‌హెక్సిడిన్' వంటి మౌత్‌వాష్‌లతోగాని, సున్నితంగా నోరు పుక్కిలించి, పంటికుదురులో ఎలాంటి ఇతర పదార్థాలు ఉండకుండా చూసుకోవాలి.

పంటి కుదురులో, కణజాలం అభివృద్ధి కావడానికి అనువుగా, తగు రీతిలో అవసరాన్ని బట్టి డ్రెస్సింగ్ చేయించుకోవాలి.

పుస్తక పరిచయం

సమాజానికి అవసరమైన అదాలత్ కథలు

ఒకప్పుడు రచయితలు తమకు తెలియని రంగాల గురించి తెలుసుకొని వాటిపై పుస్తకాలు, వ్యాసాలు రాసేవారు. వివిధ రంగాలలోని సమాచారాన్ని ఉపయోగించుకొని వాటిని కల్పిత సాహిత్యరూపంలో అంటే కథలు, నవలల రూపంలో అందించిన రచయితల గురించి మనకు తెలుసు. కేవలం జీవితమే కాకుండా జీవితంలోని పలు దశల్లో జీవనయానానికి సహకరించే అనేక రంగాల గురించి కనీసం వాటిలోని ప్రాథమిక విషయాలనైనా తెలుసుకోవడమనేదాన్ని నేటి మనిషి చాలా అత్యవసరంగా భావిస్తున్నాడు. దాంతో కల్పనేతర సాహిత్యానికి గిరాకీ పెరిగింది. కల్పిత సాహిత్యం మనిషిలో ఊహాశక్తిని పెంచుతుంది. కల్పనేతర సాహిత్యం అంటే నాన్‌ఫిక్షన్ పాఠకుడి విజ్ఞానాన్ని పెంచుతుంది. ప్రస్తుతం నాన్‌ఫిక్షన్ ఎక్కువ అమ్ముడుపోతున్నట్టుగా పలు ప్రచురణ కేంద్రాల గణాంక వివరాలు చెబుతున్నాయి.

అందుకే ఆయా రంగాలకు సంబంధించిన ప్రొఫెషనల్స్ రచయితలుగా మారి తమ తమ రంగాల విషయాలను పుస్తకాలు, వ్యాసాల రూపంలో అందించడం నేడు ఊపందుకుంది. వైద్యం, విద్య, న్యాయం, ఐటీ, వ్యాపారం తదితర రంగాలకు సంబంధించిన పుస్తకాలను సంబంధిత ప్రొఫెషనల్సే రాయడం వలన ఆ పుస్తకాల క్రెడిబిలిటీ పెరుగుతుంది. ఇలాంటి క్రెడిబిలిటీనే కర్ర ఎల్లారెడ్డి రచించిన 'అదాలత్ కథలు'లో చూడవచ్చు. ఈ పుస్తక రచయిత సాహిత్యాభిమాని కావడమే కాకుండా లాయర్ కూడా అవడంతో ఈ పుస్తకంలోని 52 వాస్తవ గాథలన్నీ చకచకా చదివించే సామర్థ్యాన్ని పుంజుకున్నాయి. అయితే ఈ కథల సాహిత్య విలువ గురించి కాకుండా వీటి ఉపయోగం గురించి మాత్రమే దృష్టిలో పెట్టుకుని వీటిని చదవాలి. వీటిని ఒక విధంగా డాక్యుఫిక్షన్‌గా భావించవచ్చు. దేశవ్యాప్తంగా తీర్పులు వెలువడిన పలు కేసులను పరిశీలించి వాటిలో పాఠకులకు ఉపయోగపడే వాటిని అదాలత్ కథలుగా రూపొందించారు.

న్యాయవ్యవస్థ నేడు ఎన్నో విమర్శలు ఎదుర్కొంటున్నది. కొంతమంది న్యాయవాదులు న్యాయం కోసం కాకుండా కేవలం డబ్బును దృష్టిలో పెట్టుకునే కేసులు చేపట్టడం జరుగుతోంది.

న్యాయవ్యవస్థలోని అనేక లొసుగుల్ని, క్లిష్టమైన అంశాల్ని సులభతరం చేయడానికి ఈ పుస్తక రచయిత తన శాయశక్తులా కృషి చేశారు. ఈ పుస్తకంలోని కొన్ని కథలు అదాలత్ కథలు పేరిట 2002 సంవత్సరంలో పాఠకుల దృష్టిలోకి వచ్చాయి. ఆ పుస్తకానికి లభించిన ఆదరణను దృష్టిలో పెట్టుకొని ఇరవైశాతం పాతకథలకు, ఎనభైశాతం కొత్త కథలు చేర్చి ఈ 'అదాలత్ కథలు 2004' పుస్తకాన్ని పాఠకుల ముందుకు తెచ్చారు. న్యాయశాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులే కాకుండా సామాన్య ప్రజలు కూడా ఈ పుస్తకాన్ని పఠించాల్సిన ఆవశ్యకత వుంది. ఇందులో చిట్టచివరన విదేశీ అదాలత్ కథ కెప్టెన్ డ్రైఫస్‌ను ఒక నవలిక అంటే సబబుగా ఉంటుంది. మొదలుపెడితే చివరిదాకా వేగంగా చదివించగలగడం ఈ వాస్తవగాథ ప్రత్యేకత. నాలాజ్ నికోలస్ రచించిన కెప్టెన్ డ్రైఫస్ పుస్తకాన్ని రచయిత కర్ర ఎల్లారెడ్డి స్వేచ్ఛానుసరణ చేసి అదాలత్ కథల్లో చేర్చారు. 19వ శతాబ్దం చివరన ఫ్రెంచి దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన ఉదంతమే కెప్టెన్ డ్రైఫస్ కథ. యూదుడైన డ్రైఫస్‌ను ఆ దేశ మిలిటరీ శిక్షిస్తుంది. ఆయనకు మద్దతుగా, వ్యతిరేకంగా ఫ్రెంచి దేశం చీలిపోయి వాదులాడుకుంటుంది. సంవత్సరాల తరబడి ఫ్రెంచి దేశ జైళ్ళలో మగ్గిపోయి చిట్టచివరకు విముక్తుడైన డ్రైఫస్ కథను చదివి తీరాల్సిందే. న్యాయమనేది ఎలా దాగుడుమూతలాడుతుందనే విషయాన్ని స్పష్టంగా తేలికపదాలతో చెప్పిన వైనం ఈ కథలో చూడవచ్చు.

అదాలత్ కథలు
రచన : కర్ర ఎల్లారెడ్డి;
వెల : రూ. 140/-;
పేజీలు : 200;
ప్రతులకు : స్వాతి లీగల్ పబ్లికేషన్స్, 2-5-449, అదాలత్ వెనుక, సుబేదారి, హన్మకొండ;
అన్ని ప్రముఖ పుస్తకాల షాపుల్లో

వివాహం, దాంపత్యాలకు సంబంధించిన పలు విషయాలలో ఎక్కువగా అన్యాయానికి గురయ్యేది మహిళ. ఈ పుస్తకంలో మహిళలకు ఉపయోగపడే అనేక న్యాయసంబంధ సలహాలున్నాయి. బాధిత మహిళలకు ప్రేరణ కలిగించే ఈ సలహాలను వారు తమ వ్యక్తిగత జీవితానికి వినియోగించుకోవచ్చు. పోస్టుద్వారాగానీ, టెలిఫోన్ ద్వారాగానీ తనను సంప్రదించి ఉచిత సలహాలను కూడా పొందవచ్చని రచయిత పుస్తకం చివరలో తెలిపారు.

అవినీతి పరులైన లాయర్లను, జడ్జీలను ఎద్దేవా చేస్తూ వాళ్ళ మోసాలను బట్టబయలు చేసే కథలు 'అమ్మకానికి తీర్పులు', 'అవినీతి లయర్' మొదలైనవి. ఆరోగ్యరంగంలో కూడా నేడు అనేక మోసాలు జరుగుతున్నాయి. పేషంట్లకేమి తెలునులే అనుకొని అనవసరమైన చికిత్సలు చేసే డాక్టర్లను, ఒక చికిత్సకు బదులు మరో చికిత్స చేసి పేషంట్లను మరింత కుంగదీసే వైద్యులను కోర్టుకు లాగే విధానాలు ఇందులో వున్నాయి. చట్టాల్లో విధి విధానాల్లో ఎప్పటి కప్పుడు మార్పులు వస్తుంటాయి. కాబట్టి ఈ పుస్తకాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని కోర్టుకు వెళ్ళకూడదని రచయిత చెప్పడం సబబుగా వుంది.

- సి.శిబి.రెడ్డి

స్వీ కా రం

ప్రేమాంజలి
రచన : సారంగ రామ్మూర్తి; వెల : రూ. 50/-;
ప్రతులకు : సారంగ రామ్మూర్తి, ఫ్లాట్ నెం. ఎఫ్ఎఫ్4, 4వ అంతస్తు, ఉషాకిరణ్ ఆర్కేడ్, ఓ.యు.రోడ్, విద్యానగర్, హైదరాబాద్



సుజరె జ్ఞానదీపిక
రచన : జయరామరెడ్డి; వెల : రూ. 35/-;
ప్రతులకు : భూప్రజాసాహితి నిలయం, 15/833, కమలానగరు, అనంతపురం.

తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాలకు సరిహద్దుగా తమిళనాడు వైపునే గల నీలగిరి పర్వతశ్రేణి దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాత పర్యాటక ప్రాంతం. ఈ పర్వత శ్రేణుల్లోనే ప్రఖ్యాత పర్యాటక కేంద్రం ఉదగమండలం (ఊటీ) ఉంది. దక్షిణభారత దేశంలో మద్రాసు(చెన్నయి) నగరంలో సినిమా రంగం ప్రాణం పోసుకున్నప్పటి నుండీ ఊటీకి, సినిమాకు అవినాభావ సంబంధం ఏర్పడింది. విదేశాలకు వెళ్ళి షూటింగులు జరుపుకోవడానికి ముందు అన్ని సినిమాలు తప్పనిసరిగా ఊటీలోనే పాటల షూటింగ్ జరుపుకునేవి. నీలగిరి పర్వత ప్రాంతాల వద్ద వాతావరణం స్విట్జర్లాండ్‌లో ఉన్నట్లు ఉంటుందని ఆ దేశాన్ని చూసినవారు చెబుతారు. అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు, పచ్చగా కనిపించే పర్వతాలు కనువిందు చేస్తాయి. ఊటీ అనేది నీలగిరి పర్వత శ్రేణుల్లో అత్యంత ఎత్తయిన హిల్‌స్టేషన్. మండువేసవిలో ఎంతో చల్లగా పర్యాటకులకు ఆహ్లాదం కలిగిస్తుంది.



ఊటీలోని టెలిస్కోపిక్ భవనం

శేషు

నీలగిరి పర్వతాలు

ఊటీ పర్వత ప్రాంతాల్లో 50 ఎకరాల్లో గల అద్భుతమైన బొటానికల్ గార్డెన్‌లో అత్యంత అరుదైన పుష్పాలు కనిపిస్తాయి. ప్రతి సంవత్సరం మే నెలలో ఇక్కడ పుష్ప ప్రదర్శన నిర్వహిస్తారు.

ఊటీకి పది కిలోమీటర్ల దూరంలోని దొడ్డబెట్ట అనే పర్వత ప్రదేశం నీలగిరి పర్వతాల్లో ఎత్తయినది. ఇది సముద్ర మట్టానికి 2,638 మీటర్ల ఎత్తులో ఉంటుంది. పర్యాటకులు ఇక్కడి నుండి ప్రకృతి దృశ్యాలను చూడటానికి టెలిస్కోపిక్ భవనాన్ని నిర్మించారు.

ముదుమలై వన్యమృగ సంరక్షణకేంద్రం

ఊటీకి 67 కిలోమీటర్ల దూరాన మైసూర్ రోడ్‌కు ఆనుకుని 321 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించిఉన్న ముదుమలై వన్యమృగ సంరక్షణ కేంద్రం పర్యాటకులకు ఎంతో ఆనందాన్ని పంచుతుంది. చిక్కటి అడవులు, ఎత్తయిన పర్వతాలు, అగాధాలు, లోయలు, నదులు, ప్రవాహాలు, జలపాతాలతో ఈ ప్రదేశం అలరారుతుంది. సెలవు దినం గడపడానికి ఇదొక చక్కని ప్రదేశం. పర్యావరణ అందాలకు ఇదొక ఉదాహరణ అని చెప్పవచ్చు. వాహనాల్లో అడవిలో తిరుగుతుండగా అక్కడక్కడా పులులు, చిరుతలు, ఇతర జంతువులు తారసపడవచ్చు. అడవిలో ఉదయం, సాయంత్రం వేళల్లో ఏనుగు అంబారీలు నిర్వహిస్తారు. ఫిబ్రవరి, మే నెలలో సందర్శించడానికి అనువైన సమయం. అయితే ఏడాది పొడవునా పర్యాటకులు, జంతు పరిశోధకులు వస్తూనే ఉంటారు. అడవిలో ఎగిరే పక్షులను పరిశీలించడానికి అక్కడక్కడా టవర్లు నిర్మించారు.

కన్యాకుమారి

భారత ద్వీపకల్పంలో అత్యంత మనోహరమైన ప్రకృతి సృష్టించిన అద్భుతాన్ని వీక్షించడానికి వీలైన ప్రదేశం కన్యాకుమారి. చెన్నయి నగరానికి 703 కిలోమీటర్ల దూరాన దేశానికి అట్టడుగున గల ఈ ప్రదేశంలో ఒకవైపు బంగాళాఖాతం, మరోవైపున అరేబియా సముద్రం, దిగువన హిందూమహా సముద్రం జలాలు కలిసే ప్రాంతాన్ని చూడవచ్చు. కేరళ, తమిళనాడు సందర్శించిన పర్యాటకులు కన్యాకుమారి వెళ్ళకుండా తిరుగు ప్రయాణం చేయరు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే పర్యాటక ప్రాంతాల్లో ఇది ఒకటి. ఇక్కడి సముద్ర తీరం నుండి సూర్యోదయం, సూర్యాస్తమయం, చంద్రోదయాలను చూడాల్సిందే గాని చెప్పనలవి కాదు. కన్యాకుమారి సముద్రతీరంలోని ఇసుక అనేక రంగుల్లో మెరుస్తూ ఉంటుంది. ◆

సంగీతానికి పులకించని హృదయం ఉండదు. పశు పక్ష్యాదులు కూడా సంగీత సామ్రాజ్యంలో ఓలలాడుతుంటాయి. సంగీత సాధన గురువు ద్వారా జరిగితే పరిపూర్ణత లభిస్తుందని చెబుతారు. ప్రసిద్ధి పొందిన సంగీత విద్వాంసులెందరో తాము ఫలానా వారి వద్ద సంగీత సాధన చేశామని ప్రస్తుతిస్తుంటారు. సంగీతం నేర్పించడానికి ఎంతోమంది సిద్ధపడుతుంటారు. సాధారణ పాఠశాలల మాదిరిగా సంగీతాన్ని నేర్పించే విద్యాలయం విజయనగరం జిల్లా కేంద్రంలో ఉంది. **115** సంవత్సరాల క్రితం ఏర్పాటైన ఈ కళాశాల రాష్ట్రంలోనే అరుదైన ప్రత్యేకతను సంతరించుకుంది. ప్రసిద్ధి పొందిన ఎంతోమంది విద్వాంసుల్ని, గాయకుల్ని తయారు చేసిన ఈ విద్యాలయం సంగీత సరస్వతి సిగలో మణిహారంగా నిలుస్తుంది. విజయనగరం జిల్లా కేంద్రంలో పెద్దచెరువు గట్టుకు పటమట కోట ద్వారానికి మధ్యలో ఏర్పాటైన ఈ కళాశాల ఎంతోమంది విద్వాంసుల చదువుల తల్లిగా గుర్తింపు పొందింది. చుట్టూ చిన్నపాటి ప్రహరీ, పచ్చదనం పరుచుకున్న వాతావరణంలో పురాతన భవనంలో నిర్వహిస్తున్న ఈ కళాశాలలో నిత్యం సంగీత ధ్వనులు, వీణానాదాలు, కోయిల గొంతుకలతో సంగీతం గుభాళిస్తుంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ సంగీత కళాశాలలో ఘంటసాల వెంకటేశ్వరరావు, పి.సుశీల, శ్రీరంగం గోపాలరత్నం, సాలూరు రాజేశ్వరరావు, నూకల చినసత్యనారాయణ, ముళ్ళపూడి శ్రీరామమూర్తి, కోమాండూరి కృష్ణమాచార్యులు, నేదునూరి కృష్ణమూర్తి, వయొలిన్ సుధాకర్ వంటి ఎంతోమంది ప్రముఖులు పూర్వ విద్యార్థులుగా ఉన్నారంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది.

పి.ఆర్.పి.వర్మ

సంగీత కళాశాల స్థాపనకు కారణమైన అంధ విద్యార్థి చాగంటి గంగబాబు

సంగీత సరస్వతి నిలయం విజయనగరం సంగీత విద్యాలయం

విద్యార్థినుల సంగీత కచేరి

ఆవిర్భావానికి ఆద్యుడు అంధబాలుడు

విజయనగరంలో పూసపాటి వంశీయులు రాజ్యాన్ని పరిపాలిస్తున్న సమయంలో కవులకు, కళాకారులకు ఎంతో ఆదరణ ఉండేది. నాలుగవ విజయరామరాజు హయాంలో ఈ కళాశాల ఏర్పాటుకు శ్రీకారం జరిగింది. గురువు ద్వారా సంగీతాన్ని పొందిన వారు తమ ద్వారా మరికొంతమందికి వ్యాప్తిచేసేవారు. అధ్యాపకులను నియమించి ప్రతిరోజూ నిపుణులైన విద్వాంసులతో సంగీత బోధన చేయడం ఆ కాలంలో ఎక్కడా ఉండేది

మట్టే చిరునామా

మట్టిపాడే మౌన గీతం
వామనుని మూడో పాదంలా
దిగంతాల అంచుల్ని తాకుతుంది
మానవతను ఆహ్వానిస్తూ
దానవతను నిరసిస్తూ
మనిషి బహురూప సంచారియై
మట్టి చిరునామా
వెదుకుతుంటాడు
నిగూఢ శోధనతో
నిరంతర సాధనతో
మట్టి ధాతృత్వ మౌనగీత
ధ్వనులు
చెట్ల కొమ్మలపై
కుసుమాసనమేస్తాయి
పలకరించే పరిమళాలతో
పులకరించే పచ్చదనాలతో
మట్టి చూపులు మూలాలు
మధుమాస కోకిళ్ళ గళాలు
మట్టిచేవ ఫలాలు
మకరంద మాధురీ వరాలు
మట్టి మనుగడలోని జీవసారం
మానవాభ్యుదయ కర్మాగారం
వేనవేల కోట్ల సంవత్సరాల మట్టి
దీక్ష
సకలప్రాణికోటికి శ్రీరామరక్ష
మృత్యు శకలాలకు ఊపిరిపోసి
ముత్తైదువులా నవ్వుతుంది మట్టి!
సృష్టి పరిణామ రహస్యాలకు
పుష్టి కలిగించేనిత్య చేతన నికేతనం మట్టి!
జలనిధులతో జలకాలాడి
మలయమారుత పవనాల్ని ఆఘ్రాణించి
గిరుల సిరులను శిరసున దాల్చి
ప్రకృతి మాత పాదాలకు ప్రణమిల్లి
విశ్వమానవ హృదయ స్నిగ్ధ
సమాహారమై
శాంతికాంతి కపోతాల్ని ఎగరేస్తుంది
మట్టి!!

- సి.కామేశ్వరరావు

విజయనగరం సంగీత
కళాశాల వ్యవస్థాపకుడు
విజయరామగజపతి



విజయనగరం సంగీత కళాశాల ముఖద్వారం

కాదు. విజయరామగజపతిరాజు ఆస్థానంలో చాగంటి జోగారావు అనే వ్యక్తి ఆంతరంగిక కార్యదర్శిగా పని చేసేవాడు. ఆయనకు చాగంటి గంగబాబు అనే కొడుకు ఉండేవాడు. అతను పుట్టుకతో అంధుడు అయినందున కొడుకు భవిష్యత్ ఏమవుతుందోనని ఆందోళన చెందేవాడు. ఇది గమనించి విజయరామ గజపతిరాజు ఒక జ్యోతిష్యుడ్ని విజయనగరం రప్పించి గంగబాబు జాతకం చెప్పమని అతని భవిష్యత్తు ఎలా ఉంటుందో వివరించమని కోరారు. సంగీత రంగంలో ఆ బాలుడు బాగా రాణిస్తాడని జ్యోతిష్యులు చెప్పారు. తన వ్యక్తిగత కార్యదర్శిపై అభిమానంతో అతని కొడుకు కోసం 1919 ఫిబ్రవరి 5 'విజయరామగాన కళాశాల' పేరుతో సంగీత కళాశాలను చేశారు. కళాశాల కోసం భవనాన్ని నిర్మించి స్థలాన్ని సమకూర్చారు. అంధబాలుడు గంగబాబు తనకు వయొలిన్‌పై ఎంతో ఆసక్తి ఉందని చెప్పడంతో మహారాజు జర్మనీనుంచి ప్రత్యేకంగా వయొలిన్ తెప్పించారు. అతనితో బాటు 30 మంది విద్యార్థులను మొట్టమొదట కళాశాలలో చేర్చుకుని వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వారిని బోధకులుగా నియమించారు. విద్యార్థులకు ఉచిత భోజన వసతులు కల్పించారు. ఒక అంధబాలుడిని సంగీత విద్వాంసునిగా తయారు చేయాలని చేసిన ప్రయత్నం మహోన్నతమైన సంగీత కళాశాలగా రూపాంతరం చెందింది. ఆంధ్ర రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రాచుర్యం పొందింది. సంగీతం నేర్చుకోవడానికి కళాశాల ఏర్పాటు చేయడం కూడా ఇక్కడే ప్రథమంగా జరిగింది.

ఎందరో కార్యనిర్వాహకులు

విజయనగరం సంగీత కళాశాల నిర్వాహకులుగా ఎంతోమంది ప్రముఖులు తమ సేవలను అందించారు. హరికథా పితామహుడిగా ప్రసిద్ధి పొందిన ఆదిభట్ల నారాయణదాసు ఈ సంగీత కళాశాలకు మొట్టమొదటి ప్రిన్సిపాల్‌గా నియమితులై చాలా కాలం దీనిని సక్రమంగా నిర్వహించారు. ప్రముఖ వయొలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి నాయుడు ఈ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. వైణిక విద్వాంసులు గురాచార్యులు వెంకటరమణదాసు, ప్రముఖ వైణికులు కలిగొట్ల కామరాజు, రుద్రవీణ పేరుతో ప్రత్యేకంగా వీణ వాయించడంలో పేరుపొందిన కవిరాయుని రమణయ్య తదితరులు ఈ కళాశాల విద్యార్థులను ఎంతగానో తీర్చిదిద్దారు. దూర్వాసుల సూర్యనారాయణ సోమయాజులు అనే వైణికు ఎంతోమందికి వీణను నేర్పించారు. ఈయన ప్రతిభను గుర్తించి ఆనందగజపతిరాజు ఈయన వద్ద వీణ కూడా నేర్చుకున్నారు. విజయనగరం జిల్లా కోరుకొండలో సంగీత కచేరి జరుగుతున్నప్పుడు విజయరామగజపతి హాజరయ్యారు. ఆ సమయంలో వయొలిన్ వాయించిన ద్వారం భావనారాయణరావు ప్రతిభను గమనించి ఆయనను విజయనగరం రప్పించి సంగీత కళాశాల లెక్చరర్‌గా నియమించారు. 1936లో సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా ఆయన బాధ్యతలను స్వీకరించారు. ద్వారం కుటుంబీకులు చాలాకాలం ఈ కళాశాలలో వివిధ హోదాల్లో తమ విధులను అందించారు. ఆ సమయంలో ప్రముఖ షహనాయి వాద్యకారుడు బిస్మిల్లాఖాన్ ఈ కళాశాలను సందర్శించాడు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన పద్మశ్రీ ద్వారం వెంకటస్వామినాయుడు



సంగీత కళాశాలకు విచ్చేసిన బిస్మిల్లాఖాన్

సంగీత కళాశాలకు అనుబంధ సంస్థలు

ఒకప్పుడు 30 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఈ సంగీత కళాశాల నేడు 400 మంది విద్యార్థుల స్థాయికి ఎదిగింది. విద్యార్థులకు కళాశాలలో బోధించడంతో పాటు ప్రతినెలా ఏదో మారుమూల గ్రామాల్లో సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో సంగీతం పట్ల ఆసక్తిని కలిగిస్తోంది. వేసవి సంగీత శిబిరాలను నిర్వహిస్తోంది. సంగీతం నేర్చుకోవాలని ఆసక్తి ప్రదర్శించే విద్యార్థులకు సంగీత కళాశాల స్వాగతం పలుకుతోంది. ◆

అన్నపూర్ణ దుఃఖిస్తూంది

తెల్లబంగారం దూదిపింజై తేలిపోయింది
మంగలంలో మిర్చి ఎంతవేగినా ఘాటులేదు
వరి తాలుగింజై గాలివాటం చేరుకుంది
ఆకుపచ్చని నేపథ్యంలో
అన్నదాత మోడువారిన కథాచిత్రం!
మనసును భీతి కబళించిన చోట
మనిషి మరణానికి దాసుడు
రైతు శక్తి యుక్తి కొరవడి
ఆత్మహత్యలో ఆశ్రయం!
ఆత్మవిశ్వాసమే అస్త్రం
ఆత్మహత్య కానేకాదు
ఆత్మస్థైర్యమే శస్త్రం
ఆత్మార్పణ కానేకాదు
మనస్సును గెలవాలి
సమస్యను జయించాలి
మనిషి అందుకున్న విజ్ఞాన ఫలం
మబ్బుల్ని మలేసి వానల్ని పిండటం!
అన్నదాత ఆత్మార్పణకు
అన్నపూర్ణ దుఃఖిస్తూంది
అతడు వర్జించిన బాధ్యతలు
వారసత్వపు భుజాలు మోస్తున్నాయి
గాట కట్టిన దుక్కిటెద్దులు
గడ్డిలేక కుములుతున్నాయి!
ఆత్మహత్య ఆయుధమైన
హాలికుని క్షేత్రంలో
జయించటానికి ప్రపంచం చాలా చిన్నదన్న
మహనీయుడి మాట విన్పిస్తూంది
గూటి నిర్మాణానికి చిదుగుల్ని
మోసుకొచ్చే పిచ్చుక కనిపిస్తూంది
గూట్లో బిడ్డకు ఆహారం ఏరుకొచ్చే
పక్షి మనసున ముద్రవేస్తూ వుంది!
ఇప్పుడు మనోధైర్యమే మార్గమై
ఆత్మహత్యకు అంతం పలకటానికి
పోరు ప్రకటించాల్సి వుంది!

- అడిగోపుల వెంకటరత్నమ్

న్యాయసలహాలు

జి.ఎల్.నరసింహారావు, హైకోర్టు న్యాయవాది

నా ప్రాణాలు నిలబెట్టండి

నేను నా వ్యవసాయం ఖర్చుల నిమిత్తము ది. 29. 4. 1999న రు. 19,000లు ఒకరి వద్ద అప్పుగా తీసుకొన్నాను. అప్పు రాసుకున్న ప్రామిసరీ నోటుపై ది. 4. 2. 01న రు. 4,400లును ది. 4. 2. 2002న రు. 2,000లును నోటుపై వసూళ్ళు వేశాను. ఒక పెద్ద మనిషి మధ్యవర్తిత్వం ద్వారా ది. 3. 5. 03న రు. 10,000లు ఇచ్చాను. దీనిని నోటుపై రాయలేదు. కాని పెద్దమనిషి ఇచ్చినట్టు సాక్ష్యం చెబుతానంటున్నాడు. ఇంకనూ రు. 9,000లును ది. 14. 1. 04లోపు చెల్లిస్తే నోటు చించుతామని అన్నారు. కాని పంటలు పండక చెల్లించలేకపోయాను. ఇప్పుడా వ్యక్తి కోర్టుద్వారా రు. 32,910లు చెల్లించాలని నోటీసు పంపాడు.

మా అమ్మ చనిపోతూ నా తమ్ముడు పసివాడు కావటం వలన నా పేరు మీద ఎ. 3-62 సెంట్లు రాసినది. నా తమ్ముడు నా నుండి విడిపోయి 8 సంవత్సరాలు అయ్యింది. పొలం పంచుకొన్నాము. కాని నా తమ్ముడు పేరు మీద సగం పట్టా రాయించుకోలేదు. దీనిలోనే నా కూతురికి 1ఎకరం పొలం ఇచ్చి పెళ్ళి చేశాను. సహకార బ్యాంకులో నేను రు. 40,000లు పైగా లోను తీసుకొన్నాను. ఇతరులపై రు. 30,000లు పైగా బాకీ ఉన్నది.

అప్పు ఇచ్చిన వ్యక్తి కోర్టు ద్వారా ఎ. 3-62 సెంట్లను నేను ఎవ్వరికీ అమ్మకూడదని, కౌలుకి ఇవ్వకూడదని, వ్యవసాయం చేయకూడదని మా ఊర్లో దండోరా వేయించి నా పరువు తీశాడు. ఇందుమూలంగా నాకు నా తమ్ముడు, కూతురు, అప్పుల వాళ్ళు, బ్యాంకుల నుండి వత్తిడి పెరిగింది. చిన్న కూతురు పెళ్ళికి ఎదిగింది.

నేను న్యాయపరంగా నా తమ్ముడి వాటాను, కూతురు కాపురాన్ని ఏ విధంగా నిలబెట్టాలో తెలియటం లేదు. కావున నా యందు దయ ఉంచి చట్టపరమైన లేదా న్యాయపరమైన సలహా ఇచ్చి నా ప్రాణాలు నిలబెట్టగలరని ప్రార్థించుచున్నాను.

- మల్లాది గడ్డయ్య,

మక్కాపేట, వత్సవాయి మండలం, కృష్ణాజిల్లా.

మీరు అప్పు తీసుకొని నోటు రాసి ఇచ్చారు. మీరు గతంలో ఇచ్చిన పైకం తక్కువ మొత్తంలో ఇచ్చినట్లు నోటు చూపిస్తూ రు.10,000 జమ పెట్టకుండా ఇచ్చానంటే కోర్టు నమ్మకపోవచ్చు. కావున మీరు ఆ బాకీ రు.10,000 ఇచ్చినట్లు రుజువు చేయాలంటే కొద్దిగా కష్టమే.

మీ ఆస్తిపై మీకు మీ తమ్ముడికి సమాన హక్కు ఉంటుంది. అప్పు మీ అవసరాల కోసం చేశారు. కాని మీ తమ్ముడికి సంబంధం ఉండదు. అతను ఆస్తి 8 సంవత్సరాల క్రితం పంచుకొని సాగు చేస్తున్నట్లు సాక్ష్యాలతో ధృవపరుస్తు అతని సగం వాటాలో మీకు ఏ సంబంధం లేదని రుజువు చేయాలి. దానికి అతడు కూడా ఈ దావాలో ప్రతివాదిగా చేరి వివరించాల్సి ఉంటుంది. మీ తమ్ముడు సగం ఆస్థిని కాపాడుకోవచ్చు. అమ్మకుండా కోర్టు వారు ఉత్తర్వులిచ్చారు కాని ఇంకా కేసు పెండింగ్‌లోనే ఉంది కావున మీరు జగ్గయ్యపేటలో ప్లీడర్‌ని నియమించుకొని దావా వాదించండి. అందులో అశ్రద్ధ చేస్తే మీ పరోక్షంగా తీర్పు ఇవ్వబడుతుంది.

మీరు అప్పుల చక్రబంధంలో నుండి బయటపడాలంటే ప్రభుత్వం వారు సహాయ, సహకారాల కోసం ఈ మధ్యలో రైతుల కోసం ఆర్.డి.ఓ. గారికి అర్జీ పెట్టుకోమంటున్నారు. ఆ పని చేయండి. ఏమైనా ఫలితం ఉండవచ్చు.

మాకు న్యాయం చెయ్యగలరు

మా తాతయ్య వాళ్ళు గత 20 సంవత్సరాల నుంచి పోరంబోకు భూమిని సాగుచేసుకొనుచున్నాము. పొలానికి శిస్తు కూడా చెల్లిస్తున్నాము. గత తెలుగుదేశం ప్రభుత్వం వాళ్ళు మీరు పొలాన్ని సాగు చేయవద్దు. ఇక్కడ చెక్ డ్యామ్ కడుతున్నామని చెప్పారు. మా పక్కనున్న రైతులు మిమ్మల్ని వరిసాగు చెయ్యనివ్వలేదు. మేము ఈ విషయం మండల కార్యాలయంలో చెప్పినా ఫలితం లేదు. పోలీస్ స్టేషన్‌లో చెప్పినా పట్టించుకోలేదు. మా కుటుంబం ఆ పొలం మీద ఎన్నో ఆశలు పెట్టుకొని ఉంది. మా నోట్లో మట్టి కొట్టారు. ఆ బాధతోనే మా తాతయ్య మరణించాడు. ఆ చెక్‌డ్యామ్‌లో వున్న నీళ్ళను పక్కనున్న రైతులు వాడుకుంటున్నారు. ఆ నీటి బిల్లులనూ వాళ్ళే తీసుకుంటున్నారు. మాకు తగిన న్యాయసలహా ఇవ్వగలరు. ఈ కొత్త ప్రభుత్వం ద్వారా మాకు ఏదైనా నష్టపరిహారం లభిస్తుందని ఆశిస్తూ ఈ లెటర్ రాస్తున్నాను.

- నంద్రు శివ, వీరులపాడు, కృష్ణాజిల్లా

మీరు సాగు చేసుకుంటున్న భూమి ప్రభుత్వం వారిది. కావున ప్రభుత్వం వారికి ప్రజా అవసరాలకు తీసుకునే హక్కు ఎప్పుడైనా ఉంటుంది. దీనిపై ఏ విధమైనటువంటి నష్టపరిహారం పొందజాలరు. కాని మీ కుటుంబం మొత్తం ఆ భూమి మీదే జీవనం సాగిస్తోందని, ప్రస్తుతం అది కోల్పోయిన వైనం తెలుపుతూ మీరు కలెక్టర్ గారికి పిటిషన్ పెట్టుకుంటే మీ అర్జీని వారు పరిశీలించి మీకు అదే ఆధారం తప్పితే వేరే ఏది లేదని నిర్ణయానికి వస్తే మీ గ్రామంలో ఇంకేమైనా ప్రభుత్వ భూమి ఉంటే కలెక్టర్ పరిశీలించి మీకు ఏదైనా భృతి కలిగించవచ్చు.

రుచి

వెజిటబుల్ చపాతీ



కావలసిన వస్తువులు :

గోధుమ పిండి	:	అరకిలో
కొత్తిమీర	:	ఒక కట్ట
బీట్‌రూట్	:	రెండు
అల్లం	:	చిన్న ముక్క
వెన్న	:	50 గ్రాములు
పచ్చిమిర్చి	:	50 గ్రాములు
తోటకూర	:	చిన్న కట్ట
క్యారెట్	:	రెండు
క్యాబేజీ	:	వందగ్రాములు
ఉప్పు	:	తగినంత
నూనె	:	వంద గ్రాములు
జీలకర్ర	:	రెండు స్పూన్లు

తయారు చేసే విధానం:

గోధుమ పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. తోటకూర, కొత్తిమీర కడిగి సన్నగా తరగాలి. క్యారెట్, బీట్‌రూట్ తురుముకోవాలి. క్యాబేజీ, పచ్చిమిర్చి, అల్లం సన్నగా ముక్కలు కోయాలి. గోధుమ పిండిలో వీటన్నింటినీ వేసి ఉప్పు, జీలకర్ర వేసి కలపాలి. వేడినీళ్ళతో పిండిని కలపాలి. ఈ పిండిని చపాతీల్లాగా చేసుకుని పెనం మీద కొంచెం నూనె వేసి కాల్చుకోవాలి. వేడిమీద తింటే చాలా రుచిగా ఉంటాయి. విటమిన్లు పోకుండా ఉంటాయి కాబట్టి ఆరోగ్యరీత్యా కూడా చాలా మంచిది. డైటింగ్ చేసే వాళ్ళు వీటిని రోజూ చేసుకొని తినవచ్చు.

బూడిద గుమ్మడికాయ హల్వా

కావలసిన వస్తువులు :

బూడిద గుమ్మడికాయ	:	ఒకటి
పంచదార	:	ఒకటిన్నర కిలో
ఏలకులు	:	10
కిస్‌మిస్	:	50 గ్రాములు
పచ్చ కర్పూరం	:	చిటికెడు
నెయ్యి	:	పావుకిలో
జీడిపప్పు	:	వంద గ్రాములు
పాలు	:	అరలీటరు

తయారు చేసే విధానం:

బూడిద గుమ్మడికాయపై చెక్కును తీసివేయాలి. లోపల విత్తనాలు కూడా తీసివేయాలి. దీనిని కొబ్బరి తురుముతో తురుముకోవాలి. తర్వాత కుక్కర్‌లో పెట్టి ఉడికించుకోవాలి. ఆరిన తరువాత నీరంతా పిండి వేయాలి. కిస్‌మిస్, జీడిపప్పు నేతిలో దోరగా వేయించుకోవాలి. యాలకులు పొడి చేసుకోవాలి. స్టౌ మీద గిన్నె పెట్టి పంచదార, నీళ్ళు పోసి పాకం పట్టుకోవాలి. తీగపాకం వచ్చాక తురుము, పాలు పోసి ఉడకనివ్వాలి. అడుగు అంటకుండా తిప్పుతూ ఉండాలి. పచ్చ కర్పూరం, నెయ్యి కూడా వేసి బాగా కలపాలి. ఏలకుల పొడి వెయ్యాలి. ఒక వెడల్పాటి పళ్ళెంలో నెయ్యి రాసి చదరంగా పరచాలి. దానిపై జీడిపప్పు, కిస్‌మిస్ అలంకరించాలి. ఆరిన తరువాత ఇష్టమైన ఆకారంలో ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇది చాలా రుచిగా ఉంటుంది. పిల్లలు చాలా ఇష్టంగా తింటారు.



కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీక్కూడా వీళ్లలాగా కలం స్నేహం చెయ్యాలని వుందా? మరి ఆలస్యం ఎందుకు? ఎంచక్కా ఒక పోస్ట్ కార్డు తీసుకుని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ కలర్ ఫోటోను అతికించి పోస్టు చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలూ చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.

మరి మా అడ్రస్: కలం స్నేహం, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

పేరు : వల్లభాపురపు సౌమ్య
వయసు : 9 సం॥
చదువు : 5వ తరగతి
హాబీలు : పాటలు పాడటం, డ్రాయింగ్ వేయడం, మ్యూజిక్ వినడం, చిన్నారి పేజీ చదవడం.
చిరునామా:
వి.సౌమ్య, డాటరాఫ్ ప్రసాద్,
ఈమని, దుగ్గిరాల (మం), గుంటూరు జిల్లా.
పిన్: 522 308.

పేరు : పగిడిపల్లి కృష్ణ
వయసు : 18 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : క్రికెట్ ఆడటం, ప్రజాశక్తి చదవడం, వ్యాయామం చేయడం
చిరునామా:
పి.కృష్ణ, సన్నాఫ్ యేసు,
తూటికుంట్ల, బోనకల్ (మం), ఖమ్మం జిల్లా.
పిన్: 507 208.

పేరు : నిమ్మల సంజయ్
వయసు : 13 సం॥
చదువు : 9వ తరగతి
హాబీలు : చదువు, ఆటపాటలు.
చిరునామా:
నిమ్మల సంజయ్,
డోర్ నం: 17-8-1(2),
మారుతి టాకీసు దగ్గర,
భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

పేరు : కె.జెన్ని
వయసు : 15 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : జోక్స్ వేయడం, బుక్స్ చదవడం, క్రికెట్ చూడటం, షటిల్ ఆడటం.
చిరునామా:
కె.జెన్ని, డాటరాఫ్ ఆదినారాయణ,
కలకొడిమ, తల్లాడ(మం),
ఖమ్మం జిల్లా. **పిన్:** 507 167.

పేరు : సంచాన స్వర్ణకుమారి
వయసు : 5 సం॥
చదువు : 1వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి చదవడం, టీవీ చూడటం, ఆటలు ఆడటం.
లక్ష్యం: డాక్టరు కావడం.
చిరునామా:
ఎస్.స్వర్ణకుమారి, డాటరాఫ్ శ్రీనివాసరావు,
కొప్పర, వంగర (మం), శ్రీకాకుళం. **పిన్:** 532 557.

పేరు : మహ్మద్ జాఫర్
వయసు : 9 సం॥
చదువు : 4వ తరగతి
హాబీలు : డ్రాయింగ్ వేయడం, ప్రజాశక్తి, చిన్నారి చదవడం, టీవీ చూడటం, ఆటలు ఆడటం.
చిరునామా:
మహ్మద్ జాఫర్, సన్నాఫ్ మహ్మద్ మహబూబ్‌అలి,
ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల,
చింతల్‌ఘట్, కోహిర్ (మం), మెదక్ జిల్లా.

పేరు : వి.మల్లేష్ సాగర్
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి, నవలలు చదవడం, క్రికెట్ ఆడడం.
చిరునామా:
వి.మల్లేష్ సాగర్,
సన్నాఫ్ సత్యం,
అప్పాయిపల్లి (పోస్ట్),
లింగాల (మం),
మహబూబ్‌నగర్ జిల్లా.

పేరు : సి.చందు
వయసు : 16 సం॥
చదువు : 10వ తరగతి
హాబీలు : ప్రజాశక్తి చదవడం, టీవీ చూడటం
లక్ష్యం: రిపోర్టర్ కావాలని
చిరునామా:
సి.చందు, కేరాఫ్ సి.కిషన్, డోర్ నం.: 14-1/1,
న్యూబోయవాడ, పరిగి, రంగారెడ్డి జిల్లా,
పిన్: 501 501.